నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12-4-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 221 పేజీలు: 4 వెల: రూ.1/-

లాక్‌డౌన్ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు

–సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిం చా రు. లక్ష్మణరేఖను ఎవరూ దాటొద్ద ని సైబ రాబాద్ సీ వీ హెచ్చరించారు. లక్ష్మణరేఖను దాటితో కఠిన చర్యలు తప్పవన్నారు. కరోనా నిరోధానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, నిబంధనలు అతిక్రమించిన 5వేల వాహనాలు జప్తు చేశామని ప్రకటించారు. 7లక్షలకు పైగా సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధా నించామని, పలు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ప్రజల కదలికలు పసిగడుత ున్నామని సజ్జనార్ తెలిపారు. ప్రజలకు కూరగాయలు ఇంటివద్దకే వచ్చేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. అలాగే నిత్యావసర వస్తువుల పేరుతో అదేపనిగా వీధుల్లోకి రావద్దన్నారు. త కరోనా వైరస్ కట్టడిలో భాగంగా లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరి ంచాలని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు పకడ్బందీ చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు.

లాక్‌డౌన్‌ను మరో రెండు వారాలు పొడిగించాలి : సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్11: కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు లాక్‌డౌన్‌ను మరో రెండు వారాలపాటు పొడిగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. పలు రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా నివారణ చర్యలు, రాష్ట్రాల్లో పరిస్థితులపై పీఎం సమీక్ష చేపట్టారు. అదేవిధంగా లాక్‌డౌన్ కొనసాగింపుపై సీఎంల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో భాగంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ... లాక్‌డౌన్‌ను మరో 2 వారాలు పొడిగించాలని ప్రధానిని కోరారు. కరోనా కట్టడికి లాక్‌డౌన్ బాగా ఉపయోగపడిందన్నారు. కరోనా సమర్థ నియంత్రణకు లాక్‌డౌన్‌ను కనీసం రెండు వారాలపాటు కొనసాగించడం మంచిదని అభిప్రాయపడ్డారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఇంతకు మించిన మార్గం లేదన్నారు. కరోనాపై యుద్ధంలో భారత్ తప్పక గెలిచి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనాపై పోరాటానికి రాష్ట్రాలకు కేంద్రం నుంచి కావాల్సిన మద్దతు లభిస్తోందన్నారు.

దేశం ఏకతాటిపై నిలబడి కరోనా వైరస్‌పై పోరాడుతుందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. లాక్‌డౌన్ అమలు వ్యూహం కోసం ప్రధాని అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని పంట కొనుగోళ్లపై సీఎం వివరించారు. 6,849 కేంద్రాల్లో పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నట్లు ప్రధానికి తెలిపారు. ధాన్యం సేకరణకే రూ.25 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వ్యవసాయదారుల కోసం ఏం చేయాలి, ఆర్థిక వ్యవస్థను ఎలా నిర్వహించాలో వ్యూహం ఖరారు చేసి అమలు చేయాలన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3 నుంచి 5 శాతానికి పెంచాలని సీఎం కోరారు. రాష్ట్రాలు చెల్లించే అప్పుల కిస్తీలను కూడా 6 నెలల పాటు వాయిదా వేయాలన్నారు.

ప్రపంచంలో కరోనా దారికొస్తుందా?

వివిద దేశాల్లో తగ్గుతున్న కేసులు

అమెరికాలో టెస్ట్ ఫలితాల ఖచ్చితత్వంపై ఆందోళన

మే మొదటి వారం వరకు పలు దేశాల్లో కొనసాగనున్న లాక్‌డౌన్

జెనీవా,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కొద్ది రోజులుగా యూరోపియన్ దేశాల్లో వైరస్ విజృంభణ తగ్గుతూ వస్తోందని ఓ వైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతుంటే, అమెరికాలో కూడా ఆ దిశగా సంకేతాలు కనిపిస్తున్నాయని అధికారులు అంటున్నారు. అయితే ఆఫ్రికా ఖండం సహా ఇతర దేశాల్లో ప్రస్తుతం ఈ వ్యాధి వేగంగా

విజృంభిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. సుమారు 16 దేశాల్లో కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోందని తెలిపింది. కరోనావైరస్ బాధిత దేశాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆంక్షలను సడలించే విషయంలో ఆచి తూచి నిర్ణయాలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ అధ్యక్షుడు డాక్టర్ టెడ్రోస్ అధ్నామ్ గెబ్రియేసస్ అన్నారు. లాక్ డౌన్ కొనసాగుతున్నప్పటికీ ఇటలీ, స్పెయిన్ దేశాలు కొన్ని సడలింపులు ఇచ్చాయి. యూరోపియన్ దేశాల్లో ఇప్పుడిప్పుడే కోవిడ్–19 మహమ్మారి తగ్గుముఖం పడుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామం అని జెనీవాలో జరిగిన వర్చువల్ కాన్ఫరెన్స్‌లో టెడ్రోస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆంక్షల్ని సడలించే విషయంలో ఆయా దేశాలతో కలిసి డబ్ల్యూహెచ్ఓ పని చేస్తోందని, అయితే ఇప్పటికిప్పుడు లాక్ డౌన్ ఎత్తివేసే పరిస్థితి లేదని అన్నారు. వెంటనే ఆంక్షల్ని సడలించడం వల్ల మహమ్మారి మరింత తిరగబెట్టవచ్చు' అని డాక్టర్ టెడ్రోస్ హెచ్చరించారు. మరోవైపు

పీసీఆర్ ఆధారితకరోనా టెస్టుల సంఖ్య పెరిగే గొద్దీ కొత్త సమస్య ఉత్పన్నమవుతుందని అమెరికాలో తాజాగా జరిగిన అధ్యయనం హెచ్చరిస్తోంది. ఇప్పటి వరకూ ఓ వ్యక్తికి కరోనా సోకిందా లేదా అనేది పీసీర్ టెక్నాలజీ ఆధారిత పరీక్షల ద్వారా నిర్ధారిస్తున్నారు. ఈ విధానంలో రోగి నుంచి సేకరించిన నమూనాల్లో కరోనా వైరస్ కణాలు ఉన్నాయో లేదో తెలుసుకుంటారు. అయితే ఈ పద్ధతి ద్వారా ఎంత కచ్చితమైన ఫలితాలు వస్తాయి అనే అంశం ఎంతో ప్రాముఖ్యంతో కూడుకున్నది. ఇప్పటివరకూ అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దీని కచ్చితత్వాన్ని 90 శాతం వరకూ పెంచవచ్చు. ఈ టెస్టుల ద్వారా కరోనా బారిన పడ్డవాళ్లలో కేవలం 90 శాతం మందిలోనే కరోనా వైరస్ ఆనవాళ్లను గుర్తించవచ్చు. మిగిలిని పది శాతం మందికి కరోనా సోకలేదనే నిర్ధారణకు వచ్చే ప్రమాదం ఉంది. దీనికి తోడు కొందరు కరోనా వ్యాధి గ్రస్థుల్లో వ్యాధి లక్షణాలు కనిపించట్లదనే వార్తలు వస్తున్న నేపథ్యంలో టెస్టుల కచ్చితత్వం పట్ల మరింత అప్రమత్త వహించాలని అమెరికాలోని మయో క్లినిక్‌కు చెందిన శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కరోనా నిర్ధారణ సంఖ్య పెరిగే కొద్దీ ఫాల్స్ నెగెటివ్‌ల ప్రభావం మరింత పెరిగి వ్యాధి కట్టడిలో అడ్డంకులు ఏర్పడవచ్చని చెబుతున్నారు. 40 మిలియన్ల జానాభా కలిగిన కాలిఫోర్నియాలో కేవలం ఒక్క శాతం మందికే ఈ కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపినా కూడా దాదాపు 20 వేల మందికి ఫాల్స్ నెగెటివ్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు కేవలం పీసీఆర్ పరీక్షలపైనే ఆధారపడకుండా..అనుమాతుడి శరీర లక్షణాలు, అతడు ఏయే ప్రాంతాల్లో పర్యటించాడు, ఎవరెవరిని కలుసుకున్నాడు, అతడికి చేసిన ర్యాపిడ్ యాంటీ బాడీ పరీక్షలు ఫలితాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే బాగా నష్టపోయిన స్పెయిన్ అత్యవసర సర్వీసులు కాని భవన నిర్మాణ రంగం, ఉత్పత్తి కర్మాగారాల్లో కార్మికుల్ని సోమవారం నుంచి విధులకు అనుమతించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

తాజా గణాంకాల ప్రకారం కోవిడ్–19 కారణంగా అక్కడ 15,843 మంది చనిపోయారు. సామాజిక దూరాన్ని తప్పని సరిగా పాటించాలని ప్రజలకు ప్రభుత్వం స్పష్టం చేస్తూ వస్తోంది. ఇటలీలో మే 3 వరకు లాక్ డౌన్ కొనసాగించాలని ఇటలీ ప్రధాని గుసెప్పే కాంటే నిర్ణయించారు. ఇన్ని రోజులుగా ఆంక్షలు పాటించడం వల్ల కల్గిన లాభాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని పిలుపునిచ్చారు. అదే సమయంలో మార్చి 12 నుంచి మూతపడ్డ చిన్న చిన్న వ్యాపారాలను మంగళవారం నుంచి తిరిగి తెరవనున్నారు. లాక్ డౌన్ మొదలైనప్పటి నుంచి కేవలం నిత్యావసరాలు, మందుల దుకాణాలను మాత్రమే తెరిచి ఉంచేందుకు అనుమతిచ్చారు. ఐర్లాండ్‌లో మే 5 వరకు లాక్ డౌన్ కొనసాగనుంది. ఇస్తాంబుల్, అంకారా సహా మొత్తం 31 నగరాల్లో 48 గంటల కర్ఫ్యూని ప్రకటించింది టర్కీ ప్రభుత్వం. సరిగ్గా 2 గంటల ముందే ఈ నిర్ణయం ప్రకటించడంతో నిత్యావసరాల కోసం షాపుల్లో జనం ఎగబడ్డారు. పోర్చుగల్ దేశంలో మే1 వరకు అత్యవసర పరిస్థితి కొనసాగనుంది. లాక్ డౌన్ విషయంలో బ్రిటన్ మల్లగుల్లాలు పడుతోంది. అయితే పరిస్థితి కుదుటపడేంత వరకు లాక్ డౌన్ ఆంక్షలు కొనసాగుతాయని చెబుతోంది.లాక్ డౌన్‌ను దక్షిణాఫ్రికా మరో 2 వారాలు పొడిగించింది. మొత్తంగా పరిస్థితి అనుకున్నంత మేలుగా మాత్రం లేదని అర్థం అవుతోంది.

పూలే విధానాలతో ముందుకు సాగుతున్నాం

–నివాళి అర్పించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలే మహాత్మా జ్యోతిరావు పూలేకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన సంఘ సంస్కర్త, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహిళా విద్యాభివృద్ధికి కృషిచేసిన స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ పూలేకు ఘన నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకోవడం అదృష్టమిన సీఎం అన్నారు. ఎన్నో సామాజిక సంస్కరణలకు జ్యోతిరావు పూలే నాంది పలికారన్నారు. సమసమాజ స్థాపనకై పూలే అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. కుల, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. అందరికీ విద్యనందించాలని ఉద్యమం చేపట్టి పూలే ఆదర్శంగా నిలిచినట్లు సీఎం పేర్కొన్నారు.

ఆర్థిక సలహాలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధమే

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ రాజన్ వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ లాక్‌డౌన్ కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించేందుకు తన సహకారం కోరితే చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వెల్లడించారు. అలాగే ఇప్పుడు ఎంతో సమర్థ నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థిక గండం నుంచి గట్టెక్కలేమన్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశంలో కొవిడ్ 19 విజృంభణతో కేంద్రం విధించిన లాక్‌డౌన్ కారణంగా ఆర్థిక కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. బ్యాకింగ్, ఏవియేషన్ తదితర రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. క్లిష్ట సమయంలో భారతదేశానికి తిరిగి వచ్చి సహకారం అందిస్తారా? అని అడిగిన ప్రశ్నకు రాజన్ వెంటనే.. అవును అని సమాధానమిచ్చారు. అలాగే ప్రస్తుత పరిస్థితిపై తన అభిప్రాయాలను వెల్లడిం చారు. 'ఇటలీ, అమెరికాను అతలాకుతలం చేసిన ఈ వైరస్‌ను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. ఇది ప్రజారోగ్యం మీద చూపిస్తోన్న ప్రభావం మనకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఆర్థిక కార్యకలాపాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. ఇది కచ్చి తంగా తీవ్ర ఆర్థిక మాంద్యానికి నిదర్శనం. వచ్చే ఏడాది దీనినుంచి పుంజుకుంటామని ఆశిద్దాం. అయితే అది కూడా మనం తీసు కొనే చర్యల మీదే ఆధారపడి ఉంటుంది. మనకు మొదటి సంకేతం విదేశీ మారక నిల్వల్లోనే కనిపిస్తుంది. అయితే ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పోలిస్తే మన మారక విలువ కాస్త స్థిరంగా ఉం టుంది. దానికి ఆర్‌బీఐ ఇచ్చే సహకారం కారణం కావొచ్చు' ఆయన వెల్లడించారు.

ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్,అమిత్ షాలు కూడా ఉన్నారు.

కరోనా కట్టడికి కలసికట్టుగా కృషి

24గంటలూ అందరికీ అందుబాటులో ఉంటా

తాజా పరిస్థితులు..కరోనా నియంత్రణ చర్యలపై ఆరా

తమకు నిధులిచ్చి ఆదుకోవాలన్న కాంగ్రెస్ పాలిత సిఎంలు

లాక్‌డౌన్‌ను పొడిగించాలన్న పలువురు ముఖ్యమంత్రులు

మాస్కు ధరించిన ప్రధాని..పలువురు సిఎంలు

రాష్ట్రాల సిఎంలతో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడి పోరులో భాగంగా ఆయారాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూనే, వారికి తాను 24గంటలు అందుబాటులో ఉంటానని ప్రధాని మోడీ అభయమిచ్చారు. ఎప్పుడైనా తనతో సంప్రదించవచ్చని అన్నారు. అలాగే ఇంతకాలం లాక్‌బడౌ÷–÷–తో ఆయారాష్ట్రాలు తీసుకున్న చర్యలు..వాటి ఫలితాలను కూడా ఆరా తీసారు. పలువురు ముఖ్యమంత్రులు లాక్÷–డౌన్‌ను పొడించాలని, లేకుంటా ఈ 21 రోజులు పడ్డ కష్టం వృధా అవుతుందన్నారు. అలాగే తాను అందరికీ అందుబాటులో ఉంటానని ముఖ్యమంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఎవరైనా, ఎప్పుడైనా తనకు ఫోన్ చేసి సలహాలు ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. అందరు కలిసి పనిచేస్తేనే ఈ మహమ్మారిని తరిమికొట్టగలమని పిలుపునిచ్చారు. రాష్ట్రాల్లో కొవిడ్–19 పరిస్థితులు, మహమ్మారి కట్టడి కోసం విధించిన లాక్‌డౌన్ పొడిగింపుపై అభిప్రాయాలే లక్ష్యంగా శనివారం ప్రధాని అన్ని రాష్ట్రాలముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలుత కేంద్ర ఆరోగ్యశాఖ దేశంలో తాజా పరిస్థితులను సభ్యులకు వివరించింది. అనంతరం ఒక్కో ముఖ్యమంత్రి తమ అభిప్రాయాల్ని ప్రధాని మోడీతో పంచుకున్నారు.

చాలా మంది సీఎంలు లాక్‌డౌన్ పొడిగించాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటికే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పంజాబ్ సీఎం అమరేందర్ సింగ్ లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించేశారు. మరోవైపు కేంద్రం లాక్‌డౌన్‌ను పొడిగించాలని నిర్ణయిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బిహార్ ప్రభుత్వం లేఖ రాసింది. అయితే గ్రామీణప్రాంతాల్లో దినసరికూలీలకు మాత్రం మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఇప్పుడు అమల్లో ఉన్న లాక్‌డౌన్ ఏప్రిల్ 14తో ముగియనున్న విషయం తెలిసిందే.

లాక్‌డౌన్ విధించిన తర్వాత సీఎంలతో ప్రధాని సమీక్ష నిర్వహించడం ఇది రెండోసారి. ఏప్రిల్ 2న జరిగిన కాన్ఫరెన్స్‌లో 14వ తేదీ తర్వాత తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించారు. సాధారణ పరిస్థితుల్ని పూర్తిగా పునరుద్ధరించడం కుదరదని అప్పుడే స్పష్టం చేశారు. దశలవారీగా ఆంక్షల సడలింపు ఉంటుందని సంకేతాలిచ్చారు. తాజాగా పూర్తిస్థాయి లాక్‌డౌన్ కొనసాగాలని రాష్ట్రాల నుంచి డిమాండ్ వచ్చిన విషయం తెలిసిందే. కరోనా కట్టడికి లాక్‌డౌన్‌ను పొడిగించాలని ఇప్పటికే పలు రాష్ట్రాలు ప్రధాని మోదీని కోరాయి. ముఖ్యమంత్రులతో సమీక్ష అనంతరం లాక్‌డౌన్‌పై ప్రధాని మోదీ నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు లాక్‌డౌన్‌తో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు దిగజారాయని, రాష్ట్రాలకు నిధులను విడుదల చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. కరోనా కట్టడికి దేశవ్యాప్తంగా కొనసాగుతున్న లాక్‌డౌన్ ఏప్రిల్ 14న ముగుస్తుంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్‌ను పొడిగించాలా.. వద్దా..? అన్న దానిపై ప్రధాని నేరంద్ర మోడీ శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించివారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ మేరకు ఏప్రిల్ 14 తర్వాత లాక్‌డౌన్ పొడిగింపు, తదితర అంశాలపై కీలక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

కరోనా వైరస్‌కట్టడికి కేంద్రం నుంచి నిత్యం సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రులు కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. లాక్‌డౌన్‌పై మోడీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని దేశ ప్రజలందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 7447కు చేరుకుంది. ఇక మరణాల సంఖ్య 239కు చేరుకుంది. అయితే..24 గంటల్లో 1035 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 40 మంది మృతి మృతి చెందారు. ఆస్పత్రుల్లో 6656 మంది చికిత్స పొందుతున్నారు. 643మంది కోలుకున్నారు. అయితే.. ముందుముందు ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. దేశంలో మొత్తం 720 జిల్లాలు ఉన్నా.. దాదాపుగా 400 జిల్లాలో కరోనా వైరస్‌ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. ఇదే సమయంలో దేశంలోని 133 జిల్లాల్లో కరోనా వైరస్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో మోడీ నిర్ణయం కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మాస్క్ ధరించిన ప్రధాని మోడీ

ఇకపోతే వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాస్క్ ధరించి పాల్గొన్నారు. సాధారణ మాస్క్ కాకుండా తెల్లటి వస్త్రంతో చేసిన మాస్క్ వేసుకోవడం విశేషం. అలాగే పలువురు ముఖ్యమంత్రులు సైతం మాస్క్ ధరించారు. ఇంట్లో తయారు చేసిన రెండు పొరలతో కూడిన మాస్క్‌ను ధరించొచ్చని గత వారం కేంద్రం సూచించిన విషయం తెలిసిందే. దానిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా నేడు మోదీ మాస్క్‌ను ధరించినట్లు తెలుస్తోంది. కరోనా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలని కేంద్రం, రాష్ట్రాలు హెచ్చరిస్తున్న విషయం విదితమే. విధిగా ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని ఆయా ప్రభుత్వాలు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాస్కు ధరించి దాని ఆవశ్యకతను పరోక్షంగా వివరించారు. దాదాపు ముఖ్యమంత్రులందరూ కూడా మాస్కులు ధరించి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. తెలంగాణ సిఎం కెసిఆర్, బీహార్ సిఎం నితీశ్ కుమార్, ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో కొత్తగా 18 పాజిటివ్ కేసులు నమోదు

మే1 వరకు లాక్‌డౌన్ పొడించిన ప్రభుత్వం

జైపూర్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): రాజస్థాన్‌లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. శనివారం కొత్తగా 18 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం సంఖ్య 579కి చేరింది. వీరిలో 14 మంది కోటా ప్రాంతానికి చెందినవారు కాగా మిగిలిన నలుగురు బికనీర్‌కు చెందినవారు. బికనీర్‌కు చెందిన నలుగురూ ఒకే కుటుంబానికి చెందినవారు కాగా, ఆ కుటుంబంలో కరోనాతో ఇప్పటికే ఒక మహిళ మరణించింది. దేశంలో ఇప్పటివరకు 7,447 కేసులు నమోదుకాగా, 40 మంది మరణించారు. మరోవైపు రాజస్థాన్‌లో లాక్‌డౌన్‌ను మే1 వరకు పొడిగించారు. కేంద్ర నిర్ణయంతో సంబంధం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

పాక్ కాల్పులకు ధీటుగా స్పందించిన సైన్యం

నియంత్రణ రేఖ వెంట పాక్ బంకర్ల ధ్వంసం

శ్రీనగర్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దుల్లో పాకిస్థాన్ అకారణంగా కాల్పులకు తెగబడింది. భారత సైనిక బలగాలు పాక్‌కు గట్టి గుణపాఠం నేర్పాయి.

కుప్వారా జిల్లా కెరాన్ సెక్టార్ల పరిధిలో నియంత్రణ రేఖ పొడవునా శుక్రవారం భారత సైనికులు బోఫోర్స్ తుపాకులతో దాడులు చేశారు. ఈ దాడితో పాక్ ఆయుధాల డంప్, టెర్రర్ లాంచ్‌ప్యాడ్లు, సైనికుల గన్ పొజిషన్ల వద్ద పేలుళ్లు సంభవించాయి. ఆరుగురు పాకిస్థాన్ సైనికులు మృతిచెందగా, మరో పదిమంది గాయపడ్డారు.

ఈ మేరకు చిత్రీకరించిన డ్రోన్ వీడియో ఫుటేజీలను భారత సైన్యం విడుదల చేసింది. పాకిస్థాన్ సైన్యానికి శక్తిమంతంగా, సమర్థవంతంగా సమాధానం చెప్పామని తెలిపింది. బారాముల్లా జిల్లా యురి సెక్టార్ పరిధిలోనూ పాక్ కాల్పులకు తెగబడిందని పోలీసులు చెప్పారు.

లాక్‌డౌన్ పొడిగిస్తే ముందు చెప్పండి

–కార్మికులకు 5వేల చొప్పున అందించండి: ఓవైసీ

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు కేంద్రం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను విధించిన విషయం తెలిసిందే.

లాక్‌డౌన్ గడువు ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. కోవిడ్–19 వ్యాధిగ్రస్తులు రోజురోజుకి పెరుగుతుండటంతో లాక్‌డౌన్‌ను పొడిగించే యోచనలో కేంద్రం ఉన్నట్లుగా సమాచారం

. దీనిపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. ఎటువంటి ప్రణాళిక లేకుండా విధించిన లాక్‌డౌన్ కారణంగా దేశవ్యాప్త కార్మికులు, వలస కూలీలు తీవ్ర బాధలు ఎదుర్కొంటున్నారన్నారు.

కేంద్రం ఒకవేళ లాక్‌డౌన్‌ను పొడిగించదలచుకుంటే మొదట ఈ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కార్మికుడికి రూ. 5 వేలు, అన్నార్థులకు సరిపడా ఆహార పదార్థాలు, వలస కూలీలకు, నిరుపేదలను ఆదుకునేందుకు రాష్ట్రాలకు తగినన్ని నిధులు ఇవ్వాలని అసదుద్దీన్ పేర్కొన్నారు.

చెన్నైలో అమ్మక్యాంటీన్ల ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.ప్రకాశ్

చెన్నై ప్రజల కడుపు నింపుతున్న అమ్మ క్యాంటీన్స్

చెన్నై, ఏప్రిల్ 11: కరోనా కట్టడి కోసం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది. దీంతో రెక్కాడితేగానీ డొక్కాడని పేదలు తిండికి తిప్పలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇలాంటి వారి కడుపు నింపడం కోసం చెన్నై నగరపాలక సంస్థ అధికారులు అమ్మ క్యాంటీన్‌లను ఉపయోగిస్తున్నారు. సాధారణ రోజుల్లో అమ్మ క్యాంటీన్‌ల ద్వారా రోజు 5 లక్షల మందికి భోజనం అందిచేవారమని, ఇప్పుడు కరోనా నేపథ్యంలో రోజుకు 11 లక్షల మందికి భోజనం పెడుతున్నామని చెన్నై నగర కార్పోరేషన్ కమిషనర్ జీ ప్రకాష్ చెప్పారు. అమ్మ క్యాంటీన్ల నిర్వహణ కోసం అవసరమైన సరుకులు సమృద్ధిగా ఉన్నాయని, లాక్‌డౌన్ ఎన్నిరోజులు కొనసాగినా ఈ క్యాంటీన్లు కొనసాగుతాయని ఆయన చెప్పారు.

చరిత్రలో నేటినిజం

కం॥ మనపరివంధులగూర్చుచు
అనప్రాణము లాడ్డి యిరుల ధైర్యము ఊడన
మనెను "ముకుంద వరదరా
జను"-ఘనతరమగు నశోక చక్రము ఊడన్ !!

(ఏప్రిల్ 12 ముకుంద వరదరాజన్
(అశోక చక్రగ్రహీత జయంతి)

–రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం
ఆదివారం 12-4-2020

ఓ రాజకీయ పరిభాష!

కాకతీయుల కాలమంతా యుద్ధాలతో గడవగా, ముందుగా పశ్చిమ చాళుక్యులకు ఆ తర్వాత ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీకి సామంతులుగా వుండడం జరిగింది. అంటే పాలెగాళ్లుగా, కప్పం కట్టే వారన్నమాట! రుద్రమదేవి కాలంలో ఓరుగల్లును సందర్శించిన మార్కోపోలో కాకతీయుల వైభవాన్ని ఎత్తిపట్టి చూపినంతగా నాటి సామాజిక పరిస్థితుల్ని, అంతర్గత వైరుధ్యాల్ని, ప్రజలతో వున్న సంబంధాల్ని ప్రస్తావించినట్లు ఆధారాలేమీ లేవు. ఒకవేళ వాస్తవిక ఆధారాలేమైనా వుంటే చరిత్రను మరో కోణంలో అన్వయించే అవకాశం వుండేది. ఈ మొత్తం వ్యవహారంలో పడిగిద్దరాజు నాయకత్వంలో ఆదివాసులు యుద్ధం చేసారని, ఈ యుద్ధంలో రాజుతోపాటు ఆయన కూతుర్లయిన సారలమ్మ, నాగులమ్మ, కొడుకు జంపన్న, అల్లుడు గోవిందరాజులు అసువులు బాయగా, (రాజకీయ పరిభాషలో చంపబడడం), భార్య సమ్మక్క యుద్ధం చేస్తూ గాయాలపాలై అటవిలోకి వెళ్లిందని, చిలకలగుట్ట ప్రాంతంలో కుంకుమ భరణి రూపంలో దర్శనమిచ్చిందని, ఆ ప్రదేశమే ఆమె బాలికగా ఆమెను పెంచిన మేడరాజుకు లభించిందనేది ఓ నమ్మకం. ఏదిఏమైనా రాజ వంశానికి చెందిన రాజుతోపాటు మొత్తం కుటుంబం మరో రాజ్యకాంక్షలో భాగంగా చంపబడ్డారు. ఈ మారణకాండకు కారణమేంటని ప్రశ్నించుకుంటే, ఆధిపత్యంతో, అంగబలంతో, సామ్రాజ్య విస్తరణతో మరో ప్రాంత రాజ్యంపై దండెత్తడమని, ఆక్రమించడమని తెలుస్తుంది. లొంగనివారిని నయానా, భయానా చెరబట్టడమని, సామంతులుగా చేసుకుని బలవంతంగా కప్పం వసూలు చేయడమని– ఓ రాజకీయ పరిభాష!

ఈ రాజకీయ పరిభాష అర్థమైతే, కప్పం కట్టేవారి ప్రజాస్వామిక హక్కుల్ని హరించడమేనన్నమాట! వరుసగా కరువు కాటకాలు రావడం, చివరికి వరప్రదాయిని అయిన గోదావరి వట్టిపోవడంతో పంటలే లేక ఆకలితో అల్లాడుతుంటే, కప్పం ఎలా కట్టగలమనేది కోయల వాదన! ఈ న్యాయమైన వాదనని మనం ఘనంగా కీర్తిస్తున్న కాకతీయులు గుర్తించకపోగా, గర్హించి యుద్ధాన్ని ప్రకటించి ఆదివాసులపై మారణకాండ సాగించడమే ఓ అప్రజాస్వామిక చర్య! దీన్నిబట్టి వీరు (కాకతీయులు) మరో రాజుకు సామంతులుగా వుంటూ స్వతంత్రాన్ని ప్రకటించుకుని రాజ్యవిస్తరణ చేయడం మనకు గొప్పగా అనిపిస్తుంది.

కాని ఇదే ఆలోచన ఓ ఆదివాసీ రాజు చేయడం తప్పుగా తోస్తుంది. నేరంగా అనిపిస్తుంది. ఈ సంధి కాలంలో, అనగా దాదాపు ఏడు శతాబ్దాలుగా పాలించిన ప్రతి పాలకుడు కాకతీయ దర్పాన్నే ప్రదర్శించినా, ప్రజలు మాత్రం ఆదివాసుల పక్షాన్నే నిలబడడం గుర్తించబడని రాజకీయం మనది. అంటే ఆదివాసులే కరెక్టు, కాకతీయులదే తప్పు అని నిగ్గు తేల్చాల్సి వస్తుంది. ఆనాడు ఆదివాసీ పోరాటాలు నేటికీ అదే గోదావరి పరీవాహక ప్రాంతంలో, దండకారణ్యంలో కొనసాగుతూనే వున్నాయి. నాడు, నేడు ఉనికి కోసం, చింతన లేని కునుకు కోసం, వున్న నేల కాళ్లకింది నుంచి కదలకుండా వుండడం కోసం జరుగుతున్నాయి. ఈ పోరాటాలన్నీ కూడా ఆయా రాజ్యాలకు వ్యతిరేకంగానే కావడం గమనార్హం! పోతే, అలనాడు అణచబడినట్లే, ఆదివాసులు నేడు కూడా అణచివేయ బడుతున్నారు. రాజ్యహింసకు గురవుతున్నారు. ఇది వాస్తవమని గుర్తిస్తే, ఆదివాసుల హక్కులు కాలరాయ బడుతున్నాయని అర్థమవుతుంది. ఇది అర్థమైతే ఆదివాసుల్ని కాకతీయ దృష్టితో చూడలేము. అలాగే నేటి పాలకపక్షం భావజాలంతో కూడా చూడలేము. మరి ఇది జరుగుతున్నదా? జరిగే పనేనా? అనేది నేటి ప్రశ్న! ఈ వైరుధ్యాల్ని పట్టించుకోకుండా ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన ఓ నాయకత్వాన్ని సంబంధిత ఆదివాసులు స్మరించుకుంటూ, సంబురాల్ని జాతర పేరున చేసుకుంటుంటే, వారి హక్కుల్ని కాలరాసిన నాటి కాకతీయల పక్షాన ఆలోచించేవారు, నేటి పాలకుల స్వభావాన్ని సమర్థించేవారు ఆ సంబురాల్లో చొరబడి, తాము సైతం.. అంటూ జండాలెత్తడం ఏంటనేది ఓ ధర్మ సందేహం!

ఆగని కరోనా మరణ మృదంగం

హైదరాబాద్, ఏప్రిల్ 11:ప్రపంచవ్యాప్తంగా కరోనా కారణంగా మరణ మృందంగం మోగుతోంది. వందరోజుల్లో ఇప్పటికే మరణాల సంఖ్య లక్ష దాటింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం అయ్యింది. యూరప్ దేశాల్లో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. కరోనా పుట్టిన చైనాలో కంట్రోల్‌లోకి వచ్చింది. ఇటలీ,అమెరికా, స్పెయిన్, జర్మన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్ లాంటి దేశాల్లో మరణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇదంతా ప్రభుత్వాల, ప్రజల నిర్లక్ష్యం కారణంగానే సాగిన మారణహోమంగా చూడాలి. ఆయా దేశాలు అనుసరించిన నిర్లక్ష్య వైఖరికి తోడు ప్రజల నిర్లక్ష్యం కూడా తోడయ్యింది. అందుకే మరణాల సంఖ్య పెరుగుతోంది. అయితే ఇతర దేశాలతో పోలిస్తే భారత్ ముందే మేల్కొంది. లాక్‌డౌన్‌తో పాటు, అంతర్‌ఆజతీయ ట్రాఫిక్స్ నిరోధించడం, ఎక్కడికక్డ రవాణాపై ఆంక్షలు విధించడం వంటి కారణాల వల్ల భారత్‌లో కమ్యూనిటీ వ్యాప్తికి ఆస్కారం లేకుండా చేశారు. ప్రధాని మోడీ ముందస్తు జాగ్రత్తలు ఇప్పుడు ప్రపంచదేవాలకు మార్గదర్శకంగా నిలిచాయి. ఢిల్లీ మర్కజ్ ఘటన లేకుండా పూర్తిగా కంట్రోల్లోకి వచ్చేది. ఏదేమైన ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో మరణాలు చాలా తక్కువని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితిలు కూడా ప్రకటించాయి. అగ్రరాజ్యం అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్లక్ష్యం కారణంగా అమెరికాలో మరణాల సంఖ్య విపరతీతంగా పెరిగాయి.

దీనికితోడు అక్కడి ప్రజలు కూడా హెచ్చరికలను కాతరు చేయలేదు. అందుకే అగ్రరాజ్యం అమెరికాలో కరోనా వైరస్ ఉగ్రరూపం దాల్చింది. వైరస్ కట్టడికి ఎన్ని చర్యలు తీసుకున్నా మరణాల సంఖ్య తగ్గడంలేదు. ఈ మహమ్మారి ధాటికి గడిచిన 24 గంటల్లో అమెరికాలో 2 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ గణంకాలు పేర్కొన్నాయి.

కరోనా వైరస్ వ్యాప్తిచెందిన నాటి నుంచి ఒకే రోజు ఇంత మంది మరణించడం ఇదే తొలిసారి కావడం విశేషం. శుక్రవారం ఒక్కరోజే 2వేలకు పైగా మంది ప్రాణాలు కోల్పోయారు. న్యూయార్క్(777), న్యూజెర్సీ(232), మిచిగాన్(205) రాష్ట్రాల నుంచే శుక్రవారం అధిక సంఖ్యలో మృతిచెందారని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకి కరోనా కేసులు చాలా వేగంగా పెరుగుతున్నాయి. అలాగే దీనికి తోడుగా కరోనాకి బలైన వారి సంఖ్య కూడా పెరుగుతూ ఉంది.

ముఖ్యంగా అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో రోజుకి వేల మందిలో చని పోతున్నారు. అయితే ప్రస్తుతం అమెరికాలో వీటి రేటు మరీ ఎక్కువగా ఉంది. దీనిని అదుపు చేయడానికి ట్రంప్ సర్కార్ కి చాలా ఇబ్బందిగా మారింది.

దీనికి కారణం అక్కడ రోజురోజుకి మరణాల రేటు తీవ్రంగా పెరగడమే. దీనితో వారు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఇక అంతకంటే దయనీమైన పరిస్థితి ఏమంటే.. మరణించిన వారి శవాలను పూడ్చడానికి ప్రదేశాలు ఉండట్లేదు. రోజురోజుకి పెరుగుతన్న మరణాలతో శవాలు ఏం చేయాలో వారికి అర్థం కావట్లేదు. దీనితో స్మశానంలో స్థలం లేక ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో లేక పబ్లిక్ పార్కులలో ఈ శవాలను ఖననం చేస్తున్నారు. అయితే అక్కడ పెద్దపెద్ద గుంతలు తవ్వి అందులో వారిని సామూహికంగా ఖననం చేస్తున్న తీరు, కననాలకు ఎవరినీ అనుమతించకపోవడం చూస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే దీనిపై ప్రభుత్వానికి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక ఇంకా దారుణమైన పరిస్థితి ఏమిటంటే న్యూయార్క్‌లో రోడ్ల మీదే శవాలు ఉన్నాయని అంతర్జాతీయ మీడియా తెలుపుతోంది. ఆలస్యంగా మేల్కొన్న అధ్యక్షుడు ట్రంప్ సర్కార్ ..రోజురోజుకి అమెరికాలో మరణాల రేటు పెరగడంతో ఏమి చేయాలో అర్థం కాక ప్రజలను రోడ్ల మీదకు రాకుండా కఠిన ఆంక్షలు మొదలు పెట్టింది. అలాగే అక్కడ పరిస్థితి ఎంతకు దిగజారింది అంటే ఎవరైనా వృద్ధులు ఆసుపత్రులకు వెళితే వాళ్లని చేర్చుకోవడం లేదు. దీనితో చివరికి ఆ వృద్ధులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి అమెరికా దిగజారిందని పరిస్థితులు తెలు స్తున్నాయి. ఏది ఏమైనా ఈ కరోనా ఎప్పటికీ శాంతిస్తుందో చెప్పలేమని, ఆర్థిక పరిస్థితి ఎప్పటికి చేతి కొస్తుందో అని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి అక్కడి దేశాలతో పోలిస్తే భారతదేశం నిజానికి చాల సురక్షితంగా ఉందనే చెప్పవచ్చు. దీనితో ఇప్పుడు వివిధ దేశాల్లో ఉన్న అనేకమంది భారతీయులు మన దేశానికి తిరిగి వస్తున్నారు. అంతేగాకుండా ఆయా దేశాల్లో ఉన్న భారతీయులే కఠినంగా లాక్‌డౌన్ పాటిస్తున్నారు. ఇల్లు వదిలి రావడం లేదు. కష్టమైనా తమ కుటుంబాలను కాపాడుకుంటున్నారు. మొత్తంగా చైనాలో పుట్టిన కరోనా వైరస్ సరిహద్దులు లేకుండా అన్నిదేశాలకూ పాకింది. కానీ ఆయా దేశాలు హద్దులు గీసుకోవడంతో పేద దేశాలకు ఈ విపత్తు నుంచి బయటపడే దారి కనిపించడం లేదు. ఇప్పుడు ప్రపంచ మంతా ప్రతి దేశానికీ అవే మందులు కావాలి. అవే మెడికల్ ఎక్విప్ మెంట్స్, కిట్లు కావాలి. దాదాపుగా 69 దేశాలు కరోనా ట్రీట్ మెంట్‌కు కావాల్సిన మందులు, ఎక్విప్ మెంట్స్, కిట్ల ఎగుమతులపై ఆంక్షలు పెట్టాయి. దీంతో చాలా దేశాలు కరోనాపై పోరాటంలో చతికిలబడుతున్నాయని అంతర్జాతీయ హెల్త్ ఎక్స్‌పర్ట్లు అంటున్నారు. సంపన్న దేశాలు ఈ విషయంలో జాతీయవాదం పక్కన పెట్టి మానవత్వంతో వ్యవహరిం చాలని కోరుతున్నాయి. ఇంత క్లిష్ట పరిస్థితి ఎన్నడూ రాలేదని, ఇంటర్నేషనల్, రీజనల్, నేషనల్ సంక్షోభాల ను నివారించే ప్రయత్నంచేసేందుకు ఇప్పటికే దారులు మూసుకుపోయాయని ఐరాస డైరెక్టర్ జనరల్ గూటెస్ పేర్కొన్నారు. ప్రస్తుత సమయంలో ప్రపంచ శాంతి, భద్రతల మెరుగుదలకు యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ పాత్ర చాలా కీలకమన్నారు. కరోనా ఈ వారం పీక్ స్టేజికి చేరుకుంటుందని, దీంతో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోందని ఐరాస అధికారులు హెచ్చరించారు. మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని చెప్పారు. దీనిని అధిగమించడానికి ప్రజలు స్వీయనియంత్రణ పాటించడమే తక్షణ కర్తవ్యమని అంతర్జాతీయ సమాజం కూడా హెచ్చరిస్తోంది.

రెడ్‌జోన్ ప్రాంతాల్లో కఠిన ఆంక్షలు అమలు

బయటకు రావడానికి వీల్లేకుండా నిరంతర పర్యవేక్షణ

చికెన్,మటన్‌లకు కూడా అనుమతి లేదు

విజయవాడ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా ప్రా బల్యం ఉన్న ప్రాంతాల్లో కఠినన నిబంధనలు అమలు చేయాలని ఎపి సర్కార్ నిర్వహించింది. ఎంపిక చేసిన రెడ్‌జోన్ ప్రాంతాల్లో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఎవరు కూడా బయటకు రాకుండా కట్టడి చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం చికెన్, మటన్ స్టాల్స్ దగ్గర భారీ సంఖ్యలో జనం గుమిగూడుతున్న దృష్ట్యా సంపూర్ణ లాక్‌డౌన్ నిర్ణయాన్ని ప్రకటించారు. దీనివలన సాధారణ రోజుల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు నిత్యావసరాల కొనుగోలుకు ఇచ్చిన వెసులుబాటు ఉండబోదని స్పష్టం చేశారు. అలానే జిల్లాలోని అన్ని రెడ్‌జోన్ల పరిధిలో ఉన్న వారు ఎవరూ బయటకు వెళ్లే వీలులేదని చెప్పారు. మెడికల్ షాపులు, ఆస్పత్రులు మాత్రం ఆదివారం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అలానే రోజు మార్చి రోజు సంపూర్ణ లాక్‌డౌన్‌ను జిల్లా అంతటా అమలు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. దీనిదృష్ట్యా ప్రజలు కనీసం పదిహేను రోజులకు అవసరమైన నిత్యావసర సరుకులు, మందులు, పిల్లలకు పాల డబ్బాలు వంటివి సమకూర్చుకోవాలని సూచించారు. అవసరమైన పక్షంలో కూరగాయలు రోజు మార్చి రోజు ఉదయం 6 నుంచి 9 గంటలలోపు కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. కరోనా వ్యాప్తి నిరోధానికై జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు తమవంతు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఇకపోతే పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో అధికంగా కరోనా విలయతాండవం చేస్తుండడంతో కఠిన నిషేధాజ్ఞలు అమలవుతున్నాయి. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. పెనుగొండలో మసీదు వీధి, ఉర్రేంకుల వారి వీధి, కొండపల్లివారి వీధిలో ఐదుగురు వ్యక్తులకు కరోనా సోకడంతో వీటి పరిధిలో 820 మీటర్ల మేర అత్యంత ప్రమాదకరమైన జోన్‌గా ప్రకటించారు. ఎవరూ బయటకు రాకుండా కట్టుదిట్టం చేశారు. అత్యవసర నంబరుకు ఫోన్ చేస్తే అవసరమైన నిత్యావసరాలు, మందులు వారి చెంతకే అందేవిధంగా ఏర్పాటు చేశారు. కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉండటంతో పెనుగొండను వచ్చేనెల 4వ తేదీ వరకు సీల్ చేయాలని అధికారులు నిర్ణయించారు. కరోనా రెండో దశకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే విపరీత పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావించారు. ఇందుకు అనుగుణంగా పెనుగొండ పరిసర ప్రాంతాలను మూడు జోన్లుగా విభజించారు. కరోనా సోకిన ప్రాంతం నుంచి 820 మీటర్ల రేడియస్‌ను డేంజర్ జోన్‌గా, మూడు కిలోమీటర్ల రేడియస్‌ను రెడ్ జోన్‌గా, 5 కిలోమీటర్ల రేడియస్‌ను ఆరంజ్ బఫర్ జోన్లుగా విభజించారు. డేంజర్ జోన్‌లో ఎటువంటి కదలికలు ఉండకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు. డేంజర్ జోన్‌లో ఉన్న సుమారు 200 మంది శ్యాంపిల్స్ సేకరించి కరోనా పరీక్షలకు పంపించారు. ఆయా రిపోర్టులు వచ్చినా వచ్చేనెల 4 వరకు ఆ ప్రాంతంలో ప్రజలంతా స్వీయ నిర్బంధంలోనే ఉండాలని వైద్యులు సూచించారు. దీంతో పెనుగొండ మొత్తం హైఅలర్ట్ ప్రకటించారు. పోలీసులు రక్షణ దుస్తులు ధరించి నిత్యం పర్యవేక్షణ చేస్తూ డ్రోన్‌లతో చిత్రీకరిస్తున్నారు. ఎవరైనా డ్రోన్‌లకు చిక్కితే కేసులు నమోదు చేయనున్నారు. ఇప్పటికే జరిమానాలు విధిస్తున్నారు.

మేడ్చెల్ జిల్లా దమ్మాయిగూడలో పేదలకు సరుకులు పంపిణీ చేసిన మంత్రి మల్లారెడ్డి

సూరత్‌లో వలస కార్మికుల ఆందోళన

–వాహనాలకు నిప్పు పెట్టడంతో పోలీసుల అలర్ట్

గాంధీనగర్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దేశంలో లాక్‌డౌన్ కారణంగా ఎక్కడికక్డ వలస కార్మికులు చిక్కుకుపోయారు. కొందరైతే కాలినడకన తమ స్వస్థలాలకు చేరుకున్నారు. ఇటీవల ఢిల్లీ నుంచి వేలాదిగా తరలిన వారిని చూస్తే దేశంలో ఇంకెంతమంది ఇలా వదిలి వెళ్లారో అవుతుంది. కొందరిని పోలీసులు

అడ్డగించి పునరావాస కేంద్రాలకు తరలించారు. గుజరాత్‌లోని సూరత్‌లో వందలాది మంది వలస కార్మికులు చిక్కుకున్నారు. తమను తమ స్వస్థలాలకు పంపాలని వలస కార్మికులు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. కాంట్రాక్టర్ల నుంచి తమ కూలీలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూరత్ వీధుల్లో ఉన్న వాహనాలకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఆందోళనలకు కారణమైన కొంతమంది వలస కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వూహాన్ విడిచి రానంటున్న కేరళ కుట్టి

బీజింగ్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): చైనాలోని వుహాన్‌లో 76 రోజుల తర్వాత లాక్‌డౌన్ తొలగించారు. ఇన్నాళ్లూ అక్కడే ఉండి అంబులెన్సుల సైరన్ శబ్దాలు, చైనీస్ భాషలోని రేడియో మెజేస్‌లు మాత్రమే వింటూ గడిపిన అనిల పి అజయన్ అనే కేరళ యువతి.. ప్రపంచమంతా కరోనా తగ్గే వరకు వుహాన్‌ను వదిలి ఎక్కడికీ వెళ్లనని అంటున్నారు. పొరపాటున కూడా తను కరోనా వాహకం కాదలచుకోలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని అమె చెబుతున్నారు. మనకు సోకుతుందేమోనన్న భయం కంటే.. మన నుంచి సోకుతుందేమోనన్న భయం ఉంటే ప్రపంచంలో ఇప్పుడిన్ని కరోనా కేసులు, మరణాలు ఉండేవే కావని అనిల అంటున్నారు. ఆ.. భయం వల్లనే.. కేరళ నుంచి మా వాళ్లు ఫోన్ చేసి రమ్మంటున్నా.. నేను వెళ్లడం లేదని అంటున్నారు. అనిల వుహాన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రో బయాలజీలో పోస్ట్ డాక్టొరల్ రిసెర్చ్ చేస్తున్నారు.

ఈ ఇల్లు..కళల హరివిల్లు

–ప్రశంసాత్మక బేబీ 'పశంస' పెయింటింగ్స్

అభినందించదగ్గ 'అభిజ్ఞ' డ్రాయింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 11:పూవు ..పుట్టగానే పరమళిస్తుంది ఆన్న చందాన ప్రశంస , అభిజ్ఞ ఈ ఇద్దరు చిన్నారులు అటు తమ విద్యను అభ్యసిస్తునే, కళల పై ఉన్న మక్కువ తో అద్భుత రీతిలో గీసిన వేసిన చిత్రాలు మాత్రం పిల్లలా పిడుగులా అనిపించేలా ఉన్నాయి.

ఎన్నెన్నో పెయింటింగ్స్ ను తమ సృజాత్మకతను ఊహా శక్తి తో మేళవించి అనేకానేక అచ్చేరువొందేలా భళా ఈ బాలల కళా..ఆన్న తీరున ప్రశంసిం చేలా.. సృజనాత్మక కూడా ఈ స్థాయిలో ఉంట దా, వారె..వ్వా అనెట్టుగా రకరకాల పెయింటింగ్స్ వేశారు.

ప్రకృతి అందాలను. ఎన్ని కోణాల్లో వారి దృక్కోణం తో చూశారో అన్నింటినీ అంతే సహజంగా తెల్ల కాగితం , డ్రాయింగ్ క్లాత్ లపై అదరగొట్టే పెయింటింగ్స్ ను నిక్షిప్తం చేశారు.ఒక సీతాకోక చిలుక, ఎగురు తున్న జింక, ఆకాశంలో పక్షులు, అమ్మాయిల కురుల అలంకరణ, మిరుమిట్లు గొలిపే వృక్ష కాంతులు, ప్రకాశించే ప్రకృతి, సూర్యోదయం, ఏకదంతుడు, సరస్సు ఒడ్డున కొబ్బరిచెట్లు, ఇలా ఎన్నో సన్నివేశాలను చూడచక్కని చిత్రాలుగా మలిచి తమ కళా పిపాసకు ప్రాణం పోశారు. ప్రకాశవంతమైన పెయింటింగ్స్ తో .పాటు ప్రకృతి సైతం పరవశించి పోయేలా..నిజంగా ఇవి నా చిత్రాలేనా అని నమ్మనంత సహజంగా తమ కళా జగత్తును ఆవిష్కృతం చేస్తున్నారు .

లాక్ డౌన్ సందర్భంగా సమయాన్ని తమ కళా నైపుణ్యం మరింత మెరుగు పరచడానికి ఇంకా కృషి చేస్తున్నారు. వీరి కళా నైపుణ్యం వయస్సుకు మించి ఉ న్నదని వీరి పెయింటింగ్స్ ను చూస్తే నిజమే అనిపించక మానదు.

చిన్నారులను అభినందించిన తెలంగాణా పద్మశాలి అఫిషియల్ ప్రొఫెషనల్స్ అసిషియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి

మాచన రఘునందన్, మాతృఛాయ, ప్లాట్ నంబర్ 15 , ఒల్ట్ సఫిల్గుడా సాయినాథపురం–500011.

ఈ చిరునామా లో ఉన్న ఇల్లు ఇది కొబ్బరి చెట్ల ఆకులు గాలికి కదిలే శబ్దం వెల్కమ్ వెల్కమ్ అన్నట్లుగా స్వాగతం పలుకుతుంటే ఈ ఇంట్లోకి వెళ్ళిన వారికి ఈ ఇంట్లో కళామా తల్లి ఆశీర్వాదం ఎంత వుందో ఈ ఇంటి వాతావరణమే గాక ఇంట్లో ఉన్న ఇద్దరు అమ్మాయిల కళా తృష్ణ గురించి తెలిస్తే వారే.. వ్వా అని అనిపించక మానదు.

మాచన ప్రశంస, మాచన అభిజ్ఞ వరుసగా ఎనమిది.ఆరవ తరగతులు సైనిక్పురి భవన్స్ స్కూల్లో చదువుతున్నారు.ఈ సీ ఐ ఎల్ సమీపంలోని సాయినాథపురం లో నివసిస్తారు. తల్లి అనిత మెదక్ జిల్లా భాహ్మన్ల పల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని. తండ్రి నందకిశోర్ ,ప్రైవేట్ ఉద్యోగి దివంగత ఉపాధ్యాయులు మాచన అభిమన్యు కుమారులు. తెలంగాణ పద్మశాలి అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసిషియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి 'రఘునందన్ మాచన' సోదరులు.

నారాయణపురంలో వ్యక్తి మృతి

కరోనా కలకలం నేపథ్యంలో పరీక్షలకు ఆదేశాలు

గుంటూరు,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): గుంటూరు జిల్లాలో కరోనా అలజడి చెలరేగుతున్న వేళ తాజాగా గురజాల నియోజకవర్గం, దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో కరోనాతో వ్యక్తి మృతి చెందాడు. దీంతో అధికారులు నారాయణపురంలో హై అలర్ట్ ను ప్రకటించారు. శనివారం డీఎస్పీ శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ... స్థానిక నారాయణపురంలో నివసించే సుమారు 50 ఏళ్ళ వ్యక్తి గత పది రోజుల నుండి తీవ్ర జ్వరంతో స్థానిక ఆర్ఎంపి వద్ద చికిత్స పొందుతున్నాడు. జ్వరం తగ్గకపోవడంతో పిడుగురాళ్ళ ప్రైవేటు అస్పత్రి కి వెళ్ళగా అక్కడ పరీక్షించిన డాక్టర్ అత్యవసరంగా గుంటూరుకు తీసుకువెళ్ళవలసిందిగా సూచించారు. గుంటూరు ఆస్పత్రి లో పరీక్షలు నిర్వహించిన కొద్దిసేపటికే వ్యక్తి మృఇతి చెందినట్లు అధికారులు తెలిపారు. కరోనా పాజిటివ్‌గా అనుమానించిన డాక్టర్లు రిపోర్టులు వచ్చేంత వరకు మృత దేహాన్ని మార్చురీ లోని ప్రత్యేక విభాగంలో భద్ర పరిచారు. శుక్రవారం రాత్రి వచ్చిన రిపోర్ట్ లలో కరోనా పాజిటివ్ అని తేలడంతో అధికారులు నారాయణపురంలో హై అలర్ట్‌ను ప్రకటించారు.

మాల్దీవులకు అండగా నిలిచిన భారత్

మందులు పంపడంతో కృతజ్ఞతలు తెలిపిన విదేశాంగ మంత్రి

మాలే,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై పోరులో తమకు అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి మాల్దీవులు విదేశాంగ మంత్రి అబ్దుల్లా షాహిద్ ధన్యవాదాలు తెలిపారు. మహమ్మారిని కట్టడి చేసేందుకు హైడ్రాక్సీక్లోరోక్విన్ మందులను సరఫరా చేయమన్న తమ అభ్యర్థనను భారత్ మన్నించిందని పేర్కొన్నారు. కరోనాపై పోరాటంలో గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న హెచ్‌సీక్యూ పంపి.. ఆపత్కాలంలో ఆదుకున్న వాడే నిజమైన స్నేహితుడని భారత్ నిరూపించిందన్నారు. 6.2 టన్నుల డ్రగ్స్ సరఫరా చేసి తమను ఆదుకున్నందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. కలిసికట్టుగా ఉంటే కోవిడ్–19ను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు షాహిద్ ట్వీట్ చేశారు. కాగా కరోనా వ్యాపిస్తున్న తరుణంలో మహమ్మారిని ఎదుర్కొనేందుకు కలసికట్టుగా పోరాడాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ సార్క్ దేశాల కు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. కరోనాతో పోరాడేందుకు సార్క్ దేశాల నాయకత్వంలో వ్యూహాలు రచించాల్సిందిగా నేను ప్రతిపాదిస్తున్నాను. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మనం చర్చిద్దాం. మన పౌరులను ఆరోగ్యవంతులుగా ఉంచుదాం. ఆరోగ్య కరమైన గ్రహం కోసం సంయుక్తంగా పనిచేసి ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలుద్దాం అని మోదీ ఇచ్చిన పిలుపునకు మాల్దీవులు సానుకూలంగా స్పందించింది. కరోనాను అరికట్టేందుకు మోదీ చొరవ చూపడం హర్షించదగ్గ విషయమని ఆ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం మహ్మత్ సోలీ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

లాక్‌డౌన్ ఉల్లంఘనలపై పోలీసుల సీరియస్

–రోడ్లపైకి వ స్తున్న వారిపై కేసులు

వరంగల్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతోంది. వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తూ రోడ్ల పైకి వస్తున్న వారి వాహనాలను పోలీసులు సీజ్ చేసి.. కేసులు నమోదు చేస్తున్నారు. కరోనా కట్టడిలో భాగంగానే తనిఖీలు ముమ్మరం చేసి కేసులు పెడుతున్నామని పోలీసులు ప్రకటించారు. కరోనా వ్యాప్తి నివారణ కోసం అన్ని చోట్ల హైపో క్లోరైడ్ స్ప్రే షెడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. నో మూమెంట్ జోన్లలో ప్రత్యేక వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.కరోనా వైరస్ కట్టడిలో భాగంగా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. నగరంలో లాక్‌డౌన్‌ను పకడ్బందీ చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. విదేశాల నుంచి వచ్చిన వారిలో ఎవరికీ పాజిటివ్ కేసు నమోదు కాలేదన్నారు. ఇంతలోనే ఢిల్లీ సంఘటనతో కొంత ఆందోళనకర పరిస్థితి నెలకొందన్నార్లు.

పూలేకు నివాళి అర్పించిన సిఎం జగన్

అమరావతి,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): మహాత్మా జ్యోతిరావు పూలేకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానిక

ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 3నెలల గడువు

-జరిమానా లేకుండానే చెల్లించే ఛాన్స్

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): సిఎం కేసీఆర్ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పించారు.

ప్రభుత్వం 2019 – 2020 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపులు ఎటువంటి జరిమానా లేకుండా రాబోయే మూడు నెలల్లో చెల్లించే అవకాశం కల్పించింది. సీఎం కేసీఆర్ దీనికి సంబంధించిన ఫైల్ పై ఈరోజు సంతకం చేశారు. పట్టణ, స్థానిక సంస్థల ప్రజలు ఆస్తి పన్ను రాబోయే మూడు నెలల్లో ఎటువంటి జరిమానా లేకుండా చెల్లించవచ్చు. ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను కట్టించుకునే పద్ధతిని మెరుగుపరచాలని సూచించారు. స్థానిక సంస్థల కమిషనర్లు ఈ మేరకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. పౌరులకు ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను కట్టించుకునే పద్ధతిని ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించడానికి కార్యాలయానికి వస్తే వారి విషయంలో తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని.... పన్ను చెల్లించేవారు సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో లాక్ డౌన్ అమల్లో ఉండటంతో రాష్ట్ర ఆదాయం భారీగా తగ్గుతోంది. గతంలో తెలంగాణ ప్రభుత్వానికి రోజుకు 400 కోట్ల రూపాయల నుంచి 500 కోట్ల రూపాయల ఆదాయం సమకూరగా ప్రస్తుతం కేవలం కోటి రూపాయలు మాత్రమే ఆదాయం సమకూరుతోంది.

పేదలకు భోజనం అందిస్తున్న గుజరాతీ సేవామండలి

-అభినందించిన మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దాతృత్వానికి హైదరాబాద్‌నగరం నిదర్శనంగా నిలుస్తోందని నగర మేయర్ బొంతు రామ్మోహన్‌పేర్కొన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి రోడ్‌లో ఉన్న గుజరాతీ సేవా మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన సెంట్రల్ కిచెన్‌ను ఆయన సందర్శించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రతి రోజూ 5వేల మందికి ఉచితంగా భోజనం పెడుతున్న గుజరాతీ సేవా మండలిని మేయర్ అభినందించారు. ఆకలితో ఏ ఒక్కరూ ఇబ్బంది పడరాదని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారని ఆయన గుర్తుచేశారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి పిలుపుతో స్పందించి నిరుపేదలు, వలస కూలీలతో పాటు కరోనా వైరస్ నియంత్రణకు కృషి చేస్తున్న క్షేత్రస్థాయి పోలీసులు, ఇతర సిబ్బందికి ఆహార పాకెట్‌లు అందిస్తున్నారని ప్రశంసించారు. వృద్ధులు, నిరాశ్రయులకు ఆహార పాకెట్‌లను, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ పర్యటనలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదరగుప్త, గుజరాతీ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఘనశ్యాం దాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మందులు,వైద్యపరికరాలపై పన్నులు ఎత్తేయాలి

-కేంద్రానికి మంత్రి ఈటెల రాజేందర్ వినతి

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో, దేశంలో తయారవుతున్న మందులు, వైద్య పరికరాలపై పన్నులు ఎత్తివేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కేంద్రాన్నికోరారు. అదే విధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై కస్టమ్స్, టాక్స్ రద్దుచేయాలని కూడా అన్నారు. శుక్రవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డా. హర్షవర్ధన్ రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఈటల కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలు ఈసీఐఎల్, డీఆర్‌డివో లాంటి సంస్థల్లో తయారుచేసి రాష్ట్రాలకు అందజేయాలన్నారు. అలాగే ఎన్-95 మాస్కులు, పీపీఈకిట్స్, టెస్టింగ్‌కిట్స్ సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు అందజేయాలని కూడా విజ్ఞప్తిచేశారు. వైద్యపరికాలు,కరోనా నియంత్రణ కోసం వినియోగిస్తున్న వాటిని బ్లాక్‌మార్కెట్‌చేయకుండా నియంత్రించాలని, వాటిని కేంద్ర ప్రభుత్వమే సేకరించి రాష్ట్రాలకు అందించాలని మంత్రి సూచించారు. ఇప్పటి వరకూ తెలంగాణలో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరగలేదని, రాష్ట్రంలో 8500 మందికి కరోనా పరీక్షలు చేస్తే 471 మందికి పాటివ్ అతి తేలిందన్నారు. వారందరికీ చికిత్స అందిస్తున్నామని, 45 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారని చెప్పారు. మరో 12 మంది చనిపోయినట్టు తెలిపారు. లాక్‌డౌన్ పొడిగించే అంశంపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలని మంత్రి ఈటల కేంద్ర మంత్రికి సూచించారు.

హాట్‌స్పాట్లలో డ్రోన్ కెమెరాలతో నిఘా

మహబూబ్‌నగర్,ఏప్రిల్11o(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించామని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సద్దల గుండు, రామయ్య బౌలి, పాశాబ్ గుట్ట, బీకే రెడ్డి కాలనీ, నలంద ఆటోస్టాండ్, కౌరంపేట ఏరియాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించామని, ఈ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఉండే వ్యక్తులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజలకు మొబైల్ రైతు బజార్ ద్వారా ఇంటి వద్దనే కూరగాయలను అందిస్తామన్నారు. నిత్యావసర సరుకుల విషయంలో కాల్‌సెంటర్‌కి ఫోన్ చేస్తే వారే ఇంటికి పంపిస్తారని తెలిపారు. జిల్లాలో 4114 మందిన హోం క్వారంటైన్‌లో ఉంచగా, ప్రస్తుతం వారిలో 456 మంది మినహా మిగతా వారి గడువు ముగిసిందన్నారు. మరో 14 రోజులు అయితే మిగతా వారి హోం క్వారంటైన్ గడువు ముగుస్తుందన్నారు.

వైద్య సిబ్బందికి రెట్టింపు జీతం

హర్యానా సిఎం సంచలన ప్రకటన

చండీఘడ్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నుంచి ప్రాణాలు రక్షించే వైద్యసిబ్బంది కోసం హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కీలక ప్రకటన చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణలో పోరాడుతున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి రెట్టింపు వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 'కరోనా వైరస్ ఉన్నంత కాలం, ఆ విభాగంలో సేవలు అందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర పారా మెడికల్ సిబ్బంది అందరికీ రెట్టింపు వేతనం ఇస్తాం .' అని ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. దీంతో పాటు కరోనా వైరస్ విధుల్లో పోలీసులు ఎవరైనా చనిపోతే ఆయా కుటుంబాల వారికి రూ.30లక్షల పరిహారం కూడా ఇస్తామని ప్రకటించారు.

మర్కజ్ సదస్సుకు వెళ్లినా తెలియకుండా రహస్యం

-కాంగ్రెస్ నేతపై కేసు నమోదు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): తబ్లిగీ జమాత్ ప్రధాన కార్యాలయంలో గత నెలలో జరిగిన మర్కజ్ సదస్సుకు హాజరైన విషయాన్ని దాచిపెట్టిన ఢిల్లీ కాంగ్రెస్ నేత ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ నేతకు, ఆయన భార్యకు, కుమార్తెలకు కరోనా పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో తేలింది. ప్రస్తుతం వీరంతా అంబేద్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, కాంగ్రెస్ నేత నివసిస్తున్న నైరుతి ఢిల్లీలోని దీన్‌పూర్ గ్రామాన్ని సైతం సీల్ చేశారు. గ్రామస్థులను ఇళ్లలోనే ఉండాల్సిందిగా అధికారు టలు సూచించారు. కాంగ్రెస్ నేతపై ఐపీసీలోని పలు సెక్షన్లు, ఎపిడమిక్ డిసీజెస్ యాక్ట్ కింద ఛావ్లా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, దేశంలోనే అతిపెద్ద కరోనా హాట్‌స్పాట్‌గా జమాత్ హెడ్‌క్వార్టర్స్ నిలవడం ఇటీవల సంచలనమైంది.

తమ్ముడి చావును కూడా చూడలేకపోయిన పోలీస్

డ్యూటీ కారణంగా వీడియో కాల్‌తో సరిపెట్టుకున్న ఎస్ఐ

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): ఒకపక్క కరోనా వైరస్.. మరోపక్క లాక్‌డౌన్. కరోనా వ్యాప్తిఇ చెందకుండా ప్రజలు వీధుల్లోకి రాకుండా పోలీసులు ఊపిరి సల్పని కార్యక్రమాలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. బందోబస్తు కోసం వెళ్లడం.. ఉన్నచోటే తినడం.. దొరికితే అక్కడే కాసేపు విశ్రాంతి తీసుకోవడం. ఇలాంటి పరిస్థితుల్లో వారు చేస్తున్న సేవలు ప్రపంచాన్ని కదిలిస్తున్నాయి. సొంతిళ్లకు కూడా వెళ్లలేని దుస్థితి ఇప్పుడు అందరికీ అనుభవమే. ఏదైనా అనుకోని ఘటన జరిగితే.. కడసారి చూపులు కూడా కరువవుతున్నాయి. అలాంటి ఘటనే నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. స్టేషన్‌లో అడ్మిన్ ఎస్ఐగా పని చేస్తున్న బచ్చు శ్రీనివాస్ సోదరుడు రంజీత్ కేన్సర్‌తో చనిపోయారు. ఈ విషయం తెలిసి ఎస్ఐ శ్రీనివాస్ తీవ్ర దుఃఖానికి లోనయ్యారు. నగరంలో ప్రస్తుతం నెలకొన్ని పరిస్థితులు దృష్ట్యా పోలీసులు అంతా విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఉండటంతో.. ఆయన తన సోదరుడి అంత్యక్రియలకు వెళ్లలేకపోయారు. కన్టోన్మెంట్ పరిమితమై తన సోదరుడి అంత్యక్రియలను వీడియో కాల్‌లో చూశారు. తన తమ్ముడికి తుది వీడ్కోలు పలుకుతూ శ్రీనివాస్ కన్నీరు మున్నీరవ్వడం అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది.

చైనాను మించిన ముందస్తు వ్యూహం

తెలంగాణ సిఎం కెసిఆర్ చొరవతో ఆధునిక వైద్యం

కరోనా దాడిని ఎదుర్కొనేలా ఆస్పత్రులు సిద్ధం

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా పుట్టిన చైనాలోని వూహాన్‌లో వారంరోజుల్లోనే వేయి పడకల ఆస్పత్రిని కట్టారని ప్రచారం జరిగింది. అక్కడ ఎలాంటి చర్యలు తీసుకున్నారో కానీ తెలంగాణలో మాత్రం ప్రపంచ దేశాలకు తీసిపోని విధంగా వైద్య సేవలు అందుతున్నాయి. సిఎం కెసిఆర్ ముందస్తు వ్యూహంతో అనేక ఆస్పత్రులు ఇప్పుడు కరోనా ఆస్పత్రలుగా మారాయి. ఆయా ఆస్పత్రుల్లో సకల సౌకర్యాలు కల్పించారు. రోగులకే కాకుండా చికిత్స అందించే వైద్యులకు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా మాస్కులు తదితర రక్షణ చర్యలు తీసుకున్నారు. దేశంలో ప్రధాని మోడీ తీసుకుంటున్న కఠిన చర్యలను పాటిస్తూనే మరింత కఠినంగా తెలంగాణ సిఎం కెసిఆర్ తగు చర్యలకు ఆదేశించి కరోనా కట్టడిలో నిరంతరం శ్రమిస్తున్నారు. కరోనా వెల్లడి కాగానే గాంధీని పూర్తిగా కరోనా కేంద్రంగా చేశారు. తరవాత ఫీవర్, కింగ్ కోఠి ఆస్పత్రులను పూర్తిస్తాయిలోకి అందుబాటులోకి తెచ్చారు. అనేక చోట్ల కా÷-వారంటైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతకు మించి గచ్చిబౌలి స్టేడియాన్ని పూర్తిస్థాయిలో కరోనా ఆస్పత్రిగా మార్చిన తీరు అభినందనీయం తొమ్మిదెకరాల విస్తీర్ణంలో పదమూడు అంతస్తుల్లో ఉన్న ఈ భవనం ఇప్పుడు కరోనా స్పెషల్ కేంద్రంగ ఆమారింది. ఆరు లిఫ్టులు.. 50 పడకలతో ఐసీయూ.. ఒక్కో అంతస్తులో 36 గదులు.. 468 గదుల్లో 1500 పడకలతో కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఉస్మానియా ఆస్పత్రికి అనుబంధంగా కోవిడ్-19 పేరుతో గచ్చిబౌలి స్టేడియంలో మరో అత్యాధునిక ఆస్పత్రిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. 20 రోజులుగా ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బిహార్‌లకు చెందిన సుమారు వెయ్యి మంది కూలీలు రాత్రింబవళ్లూ శ్రమిస్తున్నారు. ఇప్పటికే సివిల్ వర్క్స్ సహా ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయి. ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆరో అంతస్తులో పడకలను ఏర్పాటు కూడా చేసింది. గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ విలేజి పేరుతో 13 అంతస్తుల భవన నిర్మాణం చేశారు. గేమ్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన వారికి అప్పట్లో ఆ భవనంలోనే వసతి కల్పించారు. ఆ తర్వాత అదే భవనంలో రాష్ట్రస్థాయి క్రీడాకారులకు వసతి కల్పించి ఆయా అంశాల్లో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.శాట్స్‌కు ఎంపికైన వారికి ఒక అంతస్తులోనే వసతి కల్పించేవారు. మిగిలిన అంతస్తుల్లోని గదులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం కరోనా వైరస్ విస్తరిస్తుండటం, రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతుండటం, ఆస్పత్రులన్నీ రోగులతో నిండిపోవడం, అదనంగా మరికొన్ని ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సి రావడంతో.. ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని ప్రభుత్వం ఇటీవల స్వాధీనం చేసుకుంది. కోవిడ్ 19 పేరుతో పూర్తిస్థాయి ఆస్పత్రిగా తీర్చిదిద్దుతోంది. రోనా అనుమానిత లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన గచ్చిబౌలి కోవిడ్ సెంటర్‌లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఆక్సిజన్ సరఫరా లైన్లు, ఏసీలు, ఫ్యాన్లు, పడకల ఏర్పాటు పనులన్నీ పూర్తికావచ్చాయి. ఐసోలేషన్ కేంద్రంలో చికిత్సలు అందించేందుకు తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న 77 మంది వైద్యులు, 115 మంది స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై ఇక్కడ నియమించారు. ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన పూర్తిస్థాయి సిబ్బందిని నియమించేందుకు ఇప్పటికే ఉత్తర్వులను కూడా జారీ అయ్యాయి. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రిలో పని చేస్తున్న జనరల్ మెడిసిన్, అనస్థీషియన్ వైద్యుల సేవలను తాత్కాలికంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఒక్కో పడక మధ్య 8 నుంచి 12 మీటర్ల దూరం ఉండేలా చూసింది. వాటి పక్కనే సహాయకులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీతో పాటు వెంట తెచ్చుకున్న వస్తువులు భద్రపరుచుకునేందుకు అవసరమైన లాకర్ కూడా ఏర్పాటు చేశారు. ఒక అంతస్తులో కరోనా అనుమానిత లక్షణాలతో బాధపడుతున్న వారు ఉంటే.. పైఅంతస్తులో పాజిటివ్ కేసులు ఉంటాయి. ప్రతి అంతస్తులో రెండు నర్సింగ్ స్టేషన్లు, రోగులను పరీక్షించడానికి ప్రత్యేక గది సిద్ధం చేశారు. ఇప్పటికే గాంధీ సహా కింగ్‌కోఠి, ఛాతీ ఆస్పత్రి, ఫీవర్, సరోజినీదేవి, నేచర్‌క్యూర్, యునానీ, ఇతర ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసింది. కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 4,177 పడకలను, 600కుపైగా పడకలను ఏర్పాటు చేసింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోనూ పడకలను సిద్ధం చేసింది. ప్రస్తుతం వైరస్ రెండో దశలోనే ఉంది. భవిష్యత్తులో కమ్యూనిటీ స్ప్రెడ్ అయ్యే అవకాశం లేకపోలేదు. భవిష్యత్తులో రాబోయే కేసులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గచ్చిబౌలి స్టేడియంలోని ఖాళీగా ఉన్న 13 అంతస్తుల భవనాన్ని కోవిడ్ 19 పేరుతో అత్యాధునిక ఐసోలేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రతిష్టాత్మక నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు దీటుగా దీనిని తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతానికి ఇక్కడ కరోనా బాధితులకు చికిత్సలు అందించనున్నారు. ఆ తర్వాత దీన్ని పూర్తిస్థాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని నిర్ణయించినట్లు సమాచారం

ముందే మేల్కొన్న తెలంగాణ సర్కార్

కరోనా కట్టడిలో వ్యూహాత్మక చర్యలు

మర్కజ్ వెళ్ళి వచ్చిన వారి కట్టడితో అదుపులో వైరస్

మాస్కులు ధరించడం తప్పనిసరి చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): ప్రపంచమంతా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో చైనాలోని వుహాన్ నగరంలో కరోనా వైరస్ విస్తరించింది. ఆ తర్వాత క్రమంగా ఇతర దేశాలకు వ్యాప్తించింది. మార్చి 2న తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. విదేశీయుల నుంచి మాత్రమే వైరస్ వ్యాపించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం భావించింది.

ఆ మేరకు విమానాశ్రయాలను కట్టడి చేసింది. మార్చి 24 వరకు విదేశాల నుంచి 74 వేల మంది శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, వీరిలో 25,937 మందిని క్వారంటైన్‌లో ఉంచింది. లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి కరోనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికే కరోనా వైరస్ సోకింది. వీరి నుంచి మరో 20 మంది కుటుంబ సభ్యులకు వైరస్ సోకింది. మార్చి 13 నుంచి 15 వరకు ఢిల్లీలోని జరిగిన మర్కజ్ ప్రార్థనలకు తెలంగాణ నుంచి 1089 మంది హాజరైనట్లు గుర్తించారు. వీరికి సన్నిహితంగా మరో 3015 మంది ఉన్నట్లు గుర్తించింది. వీరిలో 172 మందిలో కరోనా వైరస్ వెలుగు చూసింది. వీరి నుంచి మరో వంద మందికిపైగా కుటుంబ సభ్యులకు వైరస్ విస్తరించింది. ఇలా ఇప్పటి వరకు తెలంగాణలో 471 కేసులు నమోదు కాగా, వీరిలో ఇప్పటికే 12 మంది మృత్యువాతపడ్డారు. మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారి నుంచి వారి కుటుంబ సభ్యులకు వైరస్ సోకడంతో పెద్ద సంఖ్యలో కేసులు వెలుగు చూస్తుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

వివిధ కారణాలతో ఇండ్ల నుంచి బయటకు వచ్చే వ్యక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కొంతమందిలో వ్యాధి లక్షణాలు కనిపించకపోయినప్పటికీ, వైద్యపరీక్షల్లో కరోనా పాజిటివ్ రిపోర్టులు వస్తున్నందున ప్రజలు ఈ జాగ్రత్త పాటించాలని పేర్కొంది. ప్రజలంతా మాస్కులు ధరించాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. మాస్క్‌లు తొలగించేటప్పుడు దాని ముం దుభాగాన్ని, మూలలను తాకకూడదు. చెవుల మీదుగానే తొలగించాలి.

మాస్క్‌ను తొలగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కార్యాలయాలు, కార్యస్థలాల్లో పనిచేస్తున్నవారంతా అన్నివేళల్లో తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలి. మాస్క్‌ను ఒకవైపు మాత్రమే వాడాలి. తిప్పి వాడకూడదు. ఒకసారి వాడిపారేసే మాస్క్‌ల కంటే క్లాత్‌మాస్క్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరైతేనే డిస్పోజబుల్ మాస్క్‌లు ధరించాలి. ప్రతి ఆరు గంటలకు ఒకసారి మాస్క్‌ను మార్చాలి. ఒకసారి వాడిన డిస్పోజబుల్ మాస్క్‌ను తిరిగి ధరించకూడదు. మొత్తంగా కఠిన చర్యలతోనే కరోనాను అరికట్టగలమని గ్రహించి అనేక చర్యలకు పూనుకున్నారు.

అక్రమ మద్యంతో రెండు చేతులా సంపాదన

మందుబాబుల అవసరాలు క్యాష్ చేసుకుంటున్న దళారీలు

నిజామాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ పీరియడ్‌లో మద్యం వ్యాపారుల దోపిడీకి పాల్పడుఉతంటే.. పలుప్రాంతాల్లో దొంగలు కూడా చేతివాటం ప్రదర్శిసున్నారు. మద్యం కోసం వైన్ షాపులకు కన్నాలు వేస్తున్నారు. అలాగే వ్యాపారులుకూడా మద్యం ప్రియుల బలహీనతను సొమ్ముగా మార్చుకుంటున్నారు. వైన్స్ షాపులు, బార్లలోని మొత్తం స్టాక్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. నాలుగింతల రేట్లకు మద్యం బాటిళ్లను అమ్ముకుంటూ బాగా సంపాదిస్తున్నారు.. మద్యం తాగటం బలహీనతగా మారిన కొందరు గత్యంతరం లేని స్థితిలో కొనుగోలు చేస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. వారం రోజులుగా ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయాలు గుట్టుచప్పుడు సాగుతున్నాయి. ప్రధానంగా నిజామాబాద్ నగరంలో మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం మారింది. మద్యం బ్లాక్ మార్కెట్‌లో అమ్ముడవుతుంటే మరోవైపు ఎక్సైజ్‌శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే పట్టుకొని కేసులు నమోదు చేయాల్సిన వారే అక్కమార్కులకు అండగా ఉంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ంమరో వైపు కల్తీకల్లు విజృంభిస్తోంది. నగరంలో, జిల్లాలో కల్లు డిపోలు , కల్లు దుకాణాలు ఎక్కడికక్కడ మూతపడిన విషయం తెలిసిందే. అయితే కల్లు విషయంలో సైతం రూ.10 నుండి 20 లోపు ఉండే సీసా ధర ఇప్పుడు ఏకంగా రూ.50 పైనే విక్రయాలు జరుపుతున్నారు. ఎక్కడైన సరే అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపడం నేరం. దీనిపైన ఎవరైన మాకు కచ్చితమైన సమాచారంతో ఫిర్యాదు చేస్తే సంబంధిత మద్యం ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకుని లైసెన్స్‌ను రద్దుచేయడం చేస్తామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరిసున్నారు. ఇకపోతే మందు లేకపోవడంతో మందు బాబును నిలబడనీయడంలేదు. ఏ బ్రాండ్ అయినా ఫర్వాలేదన్నట్లుగా వారి పరిస్థితి ఉంది. చివరకు గుడుంబా, నాటుసారాల వైపు చూస్తున్నారు. అదీ లేకుంటే కల్లు కోసం కల్లు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాటి వనాల వద్ద ఈ మందు బాబుల హాల్‌చల్ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.లాక్‌డౌన్ కారణంగా కొన్ని రోజులుగా మద్యం లభించకపోవడంతో పిచ్చివాళ్లుగా మారుతున్నారు. లాక్‌డౌన్‌తో మద్యం దుకాణాలను సైతం బంద్ చేశారు. నగరంలోని పలుచోట్ల కొందరు మద్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. మద్యం షాపు వద్దకు వచ్చి మద్యం ఇవ్వాలంటూ మారాం చేస్తున్నారు. మరికొంతమంది వైన్ షాపుల వద్ద మద్యం కోసం పడిగాపులు పడుతున్నారు. లాక్‌డౌన్‌తో బార్లు, మద్యం దుకాణాలు కూడా మూత పడడంతో మద్యం కోసం నానాయాతనలు పడుతున్నారు. అక్కడక్కడా బెల్టు షాపులు ఆదుకున్నా.. అక్కడ కూడా నిల్వలు అడుగంటిపోవడం.. ధరలు నింగినంటడంతో లబోదిబోమంటున్నారు. మొన్నటి వరకు ఖరీదైన బ్రాండ్లు తప్ప మద్యం ముట్టని బడాబాబులు కూడా చోటామోటా బ్రాండ్లతో సరిపుచ్చు కుంటున్నారు. కేవలం 24 గంటలపాటే జనతా కర్ఫ్యూ ఉంటుందని భావించిన మందుబాబులు.. మద్యం కొనుగోళ్లపై ముందుచూపు ప్రదర్శించలేదు. గుడుంబా అమ్మకాలను నిషేధించడంతో ఐదేళ్ల క్రితమే వీటి తయారీని నిలిపివేసిన తయారీదారులు.. అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఉద్యోగ, ఉపాధిరీత్యా ఇన్నాళ్లు హైదరాబాద్ సహా పట్టణాల్లో ఉన్నవారంతా లాక్‌డౌన్ పుణ్యామా అని పల్లెబాట పట్టారు. మద్యం లభ్యం కాకపోవడం... దొరికినా భారీ రేట్లు పలుకుతుండడంతో కల్లు సేవించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని తాటి వనాల్లో ఎక్కడ చూసినా మందుబాబుల సందడే కనిపిస్తోంది. కల్లుకు బానిసలైన కొంతమంది మాత్రం మానసికంగా బాధపడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు.

సిఎం సహాయనిధికి భారీగా విరాళాలు

3కోట్లు అందచేసిన మైహోమ్స్ గ్రూపు

5కోట్ల చెక్కును కెటిఆర్‌కు అందించిన రిలయన్స్

కోటి రూపాయలు అందించిన గంగవరం పోర్టు లిమిటెడ్

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నివారణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఉపయోగపడేందుకు పలువురు ప్రముఖులు శుక్రవారం భారీగా విరాళాలు అందించారు. ఈసందర్భంగా గంగవరం పోర్టు లిమిటెడ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయల విరాళాన్ని అందించింది. దీనికి సంబంధించిన చెక్కును సంస్థ ఛైర్మన్ డివిఎస్ రాజు ప్రతిగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందించారు.

ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సంస్థ ఛైర్మన్ కుమారుడు రాజేశ్‌రాజ్, డిటినాయక్ పాల్గొన్నారు. ఇక మైహోమ్స్ గ్రూప్‌అధినేత జూపల్లి రాజేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి 3కోట్ల రూపాయలు విరాళం ప్రకటించారు.

దీనికి సంబంధించిన చెక్కును మైహోమ్స్ గ్రూప్‌డైరెక్టర్లు జూపల్లి రామారావు, జూపల్లిశ్యామ్‌రావు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు.

తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 5 కోట్ల చెక్కును విరాళంగా ఇచ్చింది. ఈ చెక్కును మంత్రి కేటీఆర్‌కు రిలయన్స్ జియో తెలంగాణ సీఈవో కేసీ రెడ్డి, ఆర్ఐఎల్ కార్పొరేట్ వ్యవహారాల అధికారి కమల్ పొట్లపల్లి అందజేశారు.

ఈ సందర్భంగా ముఖేష్ అంబానీకి, కేసీ రెడ్డికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే పీఎం కేర్స్‌కు రిలయన్స్ రూ. 530 కోట్ల విరాళం ఇచ్చింది.

కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తామూ చేయూతనిస్తామని ఇండియన్ అకాడ

ధాన్యం కొనుగోలుపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష

జనగామ, ఏప్రిల్ 11త : లాక్‌డౌన్ అమలు, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేడు సమీక్ష చేపట్టారు. జనగామ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు యాదగిరిరెడ్డి, రాజయ్య, కలెక్టర్ నిఖిల, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కరోనా కట్టడికి కృషి చేస్తున్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జనగామ జిల్లాలో విదేశాల నుంచి వచ్చిన 64 మందిని పరీక్షించగా కరోనా నెగిటివ్‌గా తేలిందన్నారు. మర్కజ్ వెళ్లొచ్చిన ఏడుగురిలో ఇద్దరికి కరోనా పాజిటివ్ వచ్చిందన్నారు. వీరిని కలిసిన 116 మందికి కరోనా నెగిటివ్ వచ్చిందన్నారు.

రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 835 ధాన్యం కొనుగోలు కేంద్రాలు అదేవిధంగా 265 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు, 6 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

లాక్‌డౌన్ వేళ పేదలను ఆదుకోవడమూ ముఖ్యమే

ఆర్థికంగా వారిని కేంద్రం ఆదుకోవాలి

రాష్ట్రాల సిఎంలకు చిదంబరం సూచన

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ సందర్భంగా పేద ప్రజలకు అవసరమైన డబ్బును ఇవ్వాలని ప్రధాని మోదీని డిమాండ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులకు శనివారం సూచించారు. లాక్‌డౌన్ పొడగింపు విషయమై ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో చిదంబరం ఈ సూచన చేశారు.

లాక్‌డౌన్ కారణంగా పేద ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోయారని, వారు పొదుపు చేసుకున్న డబ్బులు కూడా అయిపోయాయని ఆయన అన్నారు. పేద ప్రజలు లాక్‌డౌన్ సందర్భంగా ఆహారం కోసం క్యూ లైన్లలో నిలబడుతున్నారని, వారిని ఆదుకోడానికి 65వేల కోట్లు కావాలని, అంత ఆర్థిక పుష్టి కేంద్రం వద్ద ఉందని ఆయన అన్నారు. పేదలెంత ముఖ్యమో, పేద ప్రజలు జీవించడానికి ఆహారం కూడా అంతే ముఖ్యమని మోదీతో చెప్పాలని చిదంబరం కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులకు సూచించారు. కరోనా కల్లోలం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రాల ముఖ్యమంత్రుల వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ నేత పీ చిదంబరం స్పందించారు. లాక్‌డౌన్ వల్ల గత 18 రోజులలో ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయిన పేదలను ఆదుకోవాల్సిందిగా కోరాలని ఆయన కోరారు. శనివారం వరుస ట్వీట్లలో చిదంబరం ఈ సూచనలు చేశారు. కరోనా సంకోభంతో దాచుకున్న కొద్ద పాటి సొమ్ము కూడా అయిపోయి, ఆకలితో అలమటిస్తూ పలువురు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తక్షణమే ప్రతి పేద కుటుంబానికి నగదును బదిలీ చేయాల్సిందిగా కోరాలని ముఖ్యమంత్రులకు సూచించారు. పేద ప్రజల జీవితాలు కూడా ముఖ్యమైనవని ఈ రోజు ప్రధానమంత్రికి చెప్పాలని ముఖ్యమంత్రులు అమరీందర్ సింగ్,అశోక్ గెహ్లోట్, భూపేష్ భాగెల్, వి నారాయణసామి, ఉద్ధవ్ ఠాక్రే , పళనిస్వామిలను ఉద్దేశించిన చిదంబరం ట్వీట్ చేశారు. కోవిడ్-19 (కరోనా వైరస్) పై పోరాడుతున్నట్టుగానే, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పేదలు ఉపాధి కోల్పోయారు, వారు ఆకలితో అలమటిస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? అని చిదంబరం ప్రశ్నించారు. పేదల సంక్షేమమే ఏకైక డిమాండ్ గా వుండాలని ఆయన ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు.

నెగెటివ్ రిపోర్టులతో ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు

రెండురోజులుగా ఒక్క పాజిటివ్ కేసు రాలేదు

నెగెటివ్ వచ్చిన వారిని ఇళ్లకు తరలింపు

కామారెడ్డి,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): జిల్లాలో గత రెండు రోజులుగా ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. తాజాగా 31 మందికి నెగటివ్ రిపోర్ట్ వచ్చింది. నేడు మరో 21 మంది రిపోర్ట్‌లను అధికారులు ల్యాబ్‌కు పంపనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 10 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దోమకొండ, ఎల్లారెడ్డిలో 14 రోజుల క్వారంటైన్ పూర్తి చేసుకున్న వారిని అధికారులు ఇంటికి పంపించారు. దీంతో దొమకొండ, ఎల్లారెడ్డి క్వారంటైన్ ఖాళీ అయ్యింది. కామారెడ్డి పట్టణంలోని పాజిటివ్ కేసులు నమోదు అయిన దేవునిపల్లిని కంటైన్మెంట్ జోన్‌గా పోలీసులు ప్రకటించారు. అలాగే జిల్లా అంతటా లాక్‌డౌన్‌ను పక్కాగా అమలు చేస్తున్నారు. నెగెటివ్ వచ్చిన వారిని వారి ఇండ్లకు పంపించి హోం క్వా రంటైన్‌లో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. వారు ఈ నెల 28వ తేదీ వరకు హోమ్ క్వారంటైన్‌లోనే ఉంటారని తెలిపారు. మొత్తంగా కరోనా కట్టడి సత్ఫలితాలిస్తున్నది. అధికారులు ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేసి ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్లకు తరలించి పరీక్షల కోసం శాంపిళ్లు పంపుతూ వైరస్ నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రైమరీ కాంటాక్ట్స్‌పై జిల్లా యంత్రాంగం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఢిల్లీ మర్కజ్ నుంచి వచ్చిన మెయిన్ బాధితుల నుంచి వారి కుటుంబ సభ్యులకు వ్యాధి వచ్చే లక్షణాలు మెండుగా ఉన్న నేపథ్యంలో వీరిని వెంటనే ప్రభుత్వ క్వారంటైన్లకు తరలించిన విషయం తెలిసిందే. వీరందరి శాంపిళ్లు సేకరించి పరీక్షల కోసం ఎప్పటికప్పుడు హైదరాబాద్‌కు పంపారు. పాజిటివ్ రాగానే గాంధీ దవాఖానకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 పాజిటివ్ కేసులు నమోదు కావడం తీవ్ర భయాందోళన కలిగిస్తున్న అంశం. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రై మరీ కాంటాక్ట్స్ రిపోర్ట్ పూర్తి సానుకూలంగా రావడం శుభపరిణామం. మొత్తం 112 మంది ప్రైమరీ కాం టాక్ట్స్ రిపోర్టులన్నీ నెగిటివ్‌గా రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరో 107 మంది ప్రైమరీ కాం టాక్ట్స్ రిపోర్టులు రావాల్సి ఉన్నాయి. వీటిపైన ఇంకా ఉత్కంఠ కొనసాగుతున్నది. శుక్రవారం వచ్చిన 112 నెగిటివ్ రిపోర్టులలో నగరం నుంచి 60 మంది ఉండగా.. బాల్కొండ నియోజకవర్గంలో 46, బోధన్‌లో 13 మంది ఉన్నారు. మరోవైపు పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో క్వారంటైన్ క్లస్టర్లను ఏర్పాటు చేసి నిఘాను కట్టుదిట్టం చేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 303 మంది వివిధ ప్రభుత్వ క్వారంటైన్‌లలో ఉండగా.. ఇందులో 112 మందికి నెగెటివ్ రిపోర్టులు వచ్చాయి. మరో 107 మంది రిపోర్టులు రావాల్సి ఉంది. ఇంకా 84 మంది శాంపిళ్లు సేకరించి పంపాల్సి ఉంది.

పోలీసులకు ఎల్ అండ్ టి సాంకేతిక సాయం

ప్రధాన నగరాల్లో ఉపయోగించుకుంటున్న పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు అహరహం శ్రమిస్తున్న పోలీసులకు ఎల్ అండ్ టీ గ్రూప్ అండగా నిలిచింది. ఎల్ అండ్ టీ స్మార్ట్ వరల్డ్ అండ్ కమ్యూనికేషన్ ద్వారా పోలీసులకు సాంకేతిక సహకారం అందిస్తోంది. హైదరాబాద్‌తోపాటు.. ముంబై, పుణె, నాగపూర్, ప్రయాగ్‌రాజ్, అహ్మదాబాద్, విశాఖపట్నం తదితన 20 ప్రధాన నగరాల్లో తమ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కృత్రిమ మేధ , మెషీన్ లెర్నింగ్ ఆధారంగా రూపొందించిన పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను పోలీసులకు అందించినట్లు ఎల్ అండ్ టీ సీఈవో అండ్ ఎండీ ఎస్.ఎన్.సుబ్రమణ్యన్ తెలిపారు. ఎక్కువ మంది గుమిగూడితే.. హైదరాబాద్‌లోని 200 కూడళ్లలో సీసీ కెమెరాలున్నాయి. ఎల్ అండ్ టీ అభివృద్ధి చేసిన అల్గారిథమ్‌తో.. ఎక్కడైనా ప్రజలు గుంపులుగా ఉంటే.. ఆ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది అప్రమత్తమవుతారు. ఇప్పటి వరకు హైదరాబాద్ పోలీసులు ఇలా వెయ్యికి పైగా హెచ్చరికలను అందుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి.. గుంపులను చెదరగొట్టారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ను ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు పలు సమస్యాత్మక ప్రదేశాల్లో అమర్చారు. ఎవరైనా గుంపులుగా గుమికూడితే.. ఆ ప్రాంతాల్లోని పీఏఎస్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఈ హెచ్చరికలు ఉంటాయి. అదేవిధంగా.. ట్రాఫిక్ నిర్వహణ కోసం పోలీసులు నగర వ్యాప్తంగా 40 వీఎండీ బోర్డులను ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో ట్రాఫిక్ హెచ్చరికలు, డ్రంకెన్ డ్రైవ్, అతివేగానికి సంబంధించి ఆ బోర్డులపై హెచ్చరికలు వస్తాయి. ప్రస్తుతం కోవిడ్-19 కట్టడికి తీసుకోవాల్సి చర్యలపై సందేశాలు డిస్‌ప్లే అవుతున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వ్యక్తిగత వాహనాల్లో మూడు కిలోమీటర్ల దూరానికి మించి వెళ్లకూడదనే నిబంధన ఉంది. దీన్ని అమలు చేసేందుకు ఎల్ అండ్ టీ అభివృద్ధి చేసిన అల్గారిథమ్ పోలీసులకు ఉపయోగపడుతోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్పీఆర్)ను ఉపయోగించి.. వాహనాల లొకేషన్‌ను నిరంతరం పర్యవేక్షించేలా అప్లికేషన్‌ను అభి?ద్ధి చేశారు.

లాక్‌డౌన్ ఉల్లంఘించి బర్త్‌డే వేడుకలు

-బిజెపి కార్పోరేటర్ అరెస్ట్

ముంబై,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ రూల్స్ ఉల్లంఘించి పుట్టినరోజు వేడుకులు జరుపుకున్న పన్వేల్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ కార్పొరేటర్ అజయ్ బహిరను నవీ ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు.కరోనాను అరికట్టేందుకు లాక్ డౌన్ కొనసాగుతుండగా ప్రజలకు సూచనలు చేయాల్సిన కార్పోరేటర్ తన స్నేహితుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నవీ ముంబై పోలీసులు అజయ్ బహిరతో పాటు 11 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత వారందరినీ బెయిల్ పై విడుదల చేశారు. లాక్ డౌన్ ను తప్పకుండా పాటించాలని, ఎక్కువ మంది ఒక్కచోట గుమిగూడవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు సూచించారు.

లాక్‌డౌన్‌కు ప్రతిఒక్కరు సహకరించాలి : ఎస్పీ శశిధర్

నిర్మల్ , ఏప్రిల్ 11: లాక్‌డౌన్‌కు ప్రతి ఒక్కరు సహకరించాల్సిందిగా నిర్మల్ ఎస్పీ సి.శశిధర్ రాజు ప్రజలను కోరారు. నిర్మల్ పట్టణంలో లాక్‌డౌన్ అమలును ఎస్పీ క్షేత్రస్థాయిలో నేడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో 17 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. స్వీయ నియంత్రణతో కరోనా మహమ్మారిని తరిమికొట్టొచ్చన్నారు. ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎలాంటి కారణాలు లేకుండా బయటకు రావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలన్నారు. ఎటువంటి కారణం లేకుండా బయట తిరిగే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సూర్యాపేట జడ్పీ చైర్మన్ దంపతులు రూ. 10 లక్షల విరాళం

హైదరాబాద్, ఏప్రిల్ 11: కరోనా వైరస్‌పై పోరాటానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తమవంతు సహాయంగా సూర్యాపేట జడ్పీ చైర్మన్ దంపతులు రూ. 10 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో నేడు మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. సూర్యాపేట జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ గుజ్జ దీపికా, యుగంధర్‌రావు మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో చెక్కును ప్రభుత్వానికి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు తమవంతు చేయూతగా ఈ నగదును అందజేసినట్లు ఈ సందర్భంగా దంపతులు తెలిపారు. దంపతుల ఉదారతను మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి అభినందించారు.

లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన పేదలు

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్‌కు ప్రజలు గొప్పగా సహకరిస్తున్నారని లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ తెలిపారు. లాక్‌డౌన్‌తో కోట్లాది మంది ఉపాధి కోల్పోయారన్నారు. లాక్‌డౌన్‌ను క్రమక్రమంగా.. పద్ధతి ప్రకారం సడలించాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున టెస్టింగ్‌లు జరపాలని జేపీ సూచించారు. విదేశాలతో పోలిస్తే మన దగ్గర తక్కువ సంఖ్యలో టెస్టులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడిన వారు బయటికి రాకుండా చూడాలని సూచించారు. ఇంత పెద్ద దేశంలో 200 మంది మరణించడం పెద్ద సంఖ్య కాదన్నారు. జనం గుమిగూడే కార్యక్రమాలను నిషేధించాలని జేపీ స్పష్టం చేశారు.

బెంగాల్లో లాక్‌డౌన్ ఉల్లంఘనలపై కేంద్రం సీరియస్

నిలదీసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 లాక్‌డౌన్ చర్యల విషయంలో తీవ్ర ఉల్లంఘనలపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిలదీసింది. ఈ మేరకు పశ్చిమబెంగాల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీకి శనివారంనాడు ఒక లేఖ రాసింది. రాజబజార్, నార్కెల్ డాంగ, టాప్‌సియా, మెతియాబ్రుజ్ వంటి ఏరియాల్లో పెద్ద స్థాయిలో లాక్‌డౌన్ ఉల్లంఘనలు, సామాజిక దూరం పాటించకపోవడం వంటివి చాలా స్పష్టంగా జరుగుతున్నట్టు ఆ లేఖ పేర్కొంది. మతపరమైన కార్యక్రమాల్లో జనం పెద్దఎత్తున గుమిగూడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడాన్ని ఎంహెచ్ఏ ప్రశ్నించింది. సంస్థాగత సరఫరా వ్యవస్థ ద్వారా కాకుండా రేషన్‌ను రాజకీయ నాయకుల ద్వారా పంపిణీ చేయిస్తుండటాన్ని కూడా నిలదీసింది. కరోనా విస్తరణకు ఇవి కారణాలమవుతున్నాయని మండిపడింది. ఈ విషయంలో మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. మొత్తం వ్యవహారంపై తక్షణం నివేదిక అందించాలని కూడా ఎంహెచ్ఏ ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ఇంతవరకూ 116 కరోనా కేసులు నమోదు కాగా, ఐదుగురు మృత్యువాత పడ్డారు.

కుమ్రమ్ భీమ్ జిల్లాలో ఇద్దరికి పాజిటివ్

ఇద్దరూ మరక్జ్ బాధితులే

కాడం గమనార్హం

ఆదిలాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దేశంలో నానాటికీ కరోనా కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇటీవల ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారి వల్లనే కరోనా కేసుఉల ఎక్కువగా నమోదయ్యాయి. ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారికి ఎక్కువగా కరోనా వైరస్ సోకడం వారు సరైన సమయానికి ట్రీట్ మెంట్ తీసుకోకపోవడం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతూ వచ్చింది. తాజాగా కొమురంభీమ్ జిల్లాలో తొలి సారి రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. కొమురం భీం జిల్లాలోని జైనూరుకు చెందిన ఓ వ్యక్తి కుటుంబసభ్యులకు కరోనా పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన ఇద్దరు బాధితులు గత నెల నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్ళి వచ్చినట్టుగా గుర్తించారు. అయితే ఈ పాజిటీవ్ వచ్చిన వారు ఇద్దరూ 25 వయసు లోపు ఉన్నవారే కావడం గమనార్హం. జైనూర్ మండల కేంద్రంలోని ఇద్దరు వ్యక్తులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అవడంతో జైనూర్ మండలాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మండలాన్ని రెడ్ జోన్ గా ప్రకటించారు. జిల్లాలో మొదటి సారి కేసులు నమోదు కావడం తో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే వీరిని కరోనా పాజిటీవ్ రావడంతో ఇద్దరినీ రాత్రికి రాత్రి గాంధీ ఆస్పత్రి కి తరలించినట్టు డిఎంహెచ్ఓ తెలిపారు.

మత్స్య పరిశ్రమకు లాక్‌డౌన్ మినహాయింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న లాక్‌డౌన్ నుంచి చేపల పరిశ్రమ, దాని అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. కరోనా కట్టడికి మార్చి 24న దేశంలో 21 రోజుల లాక్‌డౌన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే మొదట్లో కొన్ని నిత్యావసరాలకు మినహాయింపునిచ్చిన ప్రభుత్వం తర్వాత మరికొన్నింటిని ఆ జాబితాలో చేర్చింది. తాజాగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ చేపలు (మెరైన్), ఆక్వాకల్చర్ పరిశ్రమకు కూడా మినహాయింపులు ఇచ్చింది. ఈ పరిశ్రమకు సంబంధించిన ఆహారం, నిర్వహణ, హార్వెస్టింగ్, ప్రాసెసింగ్, ప్యాకింగ్, శీతలీకరణ, మార్కెటింగ్, అమ్మకాల వంటి వాటికి కూడా ఇది వర్తిస్తుందని పేర్కొంది. అయితే ప్రజలు తప్పనిసరిగా లాక్‌డౌన్ మార్గదర్శకాలను పాటించాలని సూచించింది.

ఎపిలో మరో 21 కొత్త కేసులు నమోదు

కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 402కి చేరిక

మరో రెండు వైరాలజీ ల్యాబ్‌ల ఏర్పాటుకు కృషి

అమరావతి,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 21 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 402కి చేరింది. తాజాగా కరోనా హెల్త్‌బులెటిన్‌ను వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసింది. శనివారం గుంటూరు-14, కర్నూలు-5, ప్రకాశం-1, కడప-1 చొప్పున కోవిడ్-19 కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 909 మందికి పరీక్షలు నిర్వహించగా 37 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఏపీలో ఇప్పటి వరకు ఆరుగురు మృతి చెందారు. ఇదిలావుంటే రాష్ట్రంలో ప్రస్తుతం 7 వైరాలజీ ల్యాబొరేటరీలు ఉండగా అదనంగా తిరుపతి రుయా ఆస్పత్రి, కర్నూలు జనరల్ ఆస్పత్రిలో ల్యాబొరేటరీలను ఏర్పాటు చేసేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. రోజుకు ఒక్కో ల్యాబ్‌లో 180 పరీక్షలు చేసే సామర్థ్యంతో కొత్తవి ఏర్పాటు చేస్తామని, ల్యాబొరేటరీల నిర్వహణాధికారి, ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కరోనా వచ్చే నాటికి మన రాష్ట్రంలో తిరుపతిలో స్విమ్స్‌లో మాత్రమే వైరాలజీ ల్యాబ్ ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య 7కు చేరింది. ఈ ల్యాబ్‌లలో రోజుకు 1,170 టెస్టులు చేస్తున్నాం. పలివెందులలోని జినోమ్‌కార్ల్ అనే సంస్థ పశువులకు సంబంధించి పరిశోధనలకు ల్యాబొరేటరీ నిర్వహించేది. ఇప్పుడా పరికరాలు ప్రభుత్వానికి ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ పరికరాలు కర్నూలు మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నాం. ఐసీఎంఆర్ అనుమతులు ఇస్తే కొత్తగా ఏర్పాటు చేసే రెండు ల్యాబ్‌లు పది రోజుల్లోగా అందుబాటులోకి వస్తాయి. అప్పుడు ల్యాబ్‌ల సంఖ్య 9కి చేరుతుంది. దీంతో రోజుకు 1,530 టెస్టులు చేసే వీలుంటుందన్నారు.

రఘురామరాజన్‌కు అరుదైన గౌరవం

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ సలహా బృందంలో చోటు

వాషింగ్టన్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ (57)కు ప్రతిష్టాత్మక గౌరవం దక్కింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటైన సలహా బృందంలో చోటు దక్కించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12మంది ఆర్థిక నిపుణులతో ఏర్పాటైన ఈ కమిటీలో రఘురామ్ రాజన్‌ను కూడా చేరుస్తూ ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా జార్జీవా ఒక ప్రకటన జారీ చేశారు. గ్లోబల్ కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ఉత్పన్నమైన అసాధారణ సవాళ్లు, పరిణామాలపై ప్రపంచ వ్యాప్తంగా దృక్పథాలను అందిస్తుందని ఐఎంఎఫ్ తెలిపింది. ఆర్థికమాంద్యంతో ఇబ్బందులు పడుతున్న తమ సభ్యదేశాలను ఆదుకునేందుకు, ఆర్థిక సహాయం, సంబంధిత విధానాల రూపకల్పనలో అసాధారణమైన నైపుణ్యం, అగ్రశ్రేణి నిపుణుల సలహాలు తమకిపుడు చాలా అవసరం అని ఆమె చెప్పారు. వీరంతా తమ అమూల్య సేవలను అందించేందుకు అంగీకరించడం తనకు గర్వంగా ఉందన్నారు. కరోనావైరస్ మహమ్మారి కారణంగా ప్రపంచం ఎదుర్కొంటున్న అసాధారణ సవాళ్లు, కీలక పరిణామాలు, ఇతర విధి విధానాలపై ఈ టీం సూచనలు చేయనుంది. సింగపూర్ సీనియర్ మంత్రి ,సింగపూర్ ద్రవ్య అథారిటీ చైర్మన్ షణ్ముగరత్నం, మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ క్రిస్టిన్ ఫోర్స్క్, ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రూడ్, యుఎన్ మాజీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ లార్డ్ మార్క్ మల్లోచ్ బ్రౌన్ తదితరులు కమిటీలో వున్నారు. కాగా కోవిడ్-19 మహమ్మారి గడచిన శతాబ్దంలో ఎదురైన సంక్షోభాలన్నికంటే తీవ్రమైన సంక్షోభాన్నిఎదుర్కొంటున్నామంటూ ఇప్పటికే క్రిస్టలినా ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర మందగనంలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఈ మహమ్మారి మరింత దెబ్బతీసిందని వ్యాఖ్యానించారు. ఐఎంఎఫ్ సభ్య దేశాల్లోని సుమారు 170 దేశాల్లో తలసరి ఆదాయం క్షీణించిందని పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ వరకు మూడేళ్లపాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్‌గా పనిచేసిన రాజన్ ప్రస్తుతం అమెరికాలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

నేడు పోలీసులు రక్తదాన కార్యక్రమం

హైదరాబాద్,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని తలసేమియా రోగుల కోసం పోలీసుశాఖ రక్తదాన కార్యక్రమం చేపట్టింది. సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలోఆదివారం రక్తదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం నారాయణగూడ ఐపీఎంలో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసేవారు 94906 17440 నంబరును సంప్రదించాలని పోలీసులు తెలిపారు. అదేవిధంగా సైబరాబాద్ కమిషనరేట్ కరోనా కంట్రోల్ రూంలో సంప్రదించొచ్చన్నారు. రక్త దాతలను నారాయణగూడ ఐపీఎంకి ప్రత్యేక వాహనంలో తరలించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 1700 మందికిపైగా తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

నిరుపేదల పాలిట వరం.... టి.ఆర్.కె ట్రస్ట్...

-ఆపద సమయంలో ఆదుకుంటాం....

-మూడు వార్డులలో 11 రకాల నిత్యావసర సరుకుల పంపిణీ...

- హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు

వేములవాడ, ఏప్రిల్ 11(నేటినిజం ప్రతినిధి):నిరుపేదలకు ఆపద సమయంలో అండగా ఉంటామని, తమ వంతు సహాయంగాటి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట కుమార్ ఆదేశాల మేరకు టి ఆర్ కె ట్రస్టు పేరిట 11 రకాల నిత్యవసర సరుకులను శనివారం ట్రస్ట్ డైరెక్టర్లు 3, 4, 6 వార్డులలో నిరుపేదలను గుర్తించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను గుర్తించి నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని టి ఆర్ కె ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. స్వచ్ఛంద సంస్థలు నిరుపేదలను ఆదుకోవడంలో ముందుండటం చాలా మంచి పరిణామం అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ఈ కార్యక్రమాన్ని ట్రస్టు సభ్యులు నిర్వహించడంతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేయలేని నిరుపేదలకు ఎంతో సహాయం చేసిన వారవుతారని అన్నారు. అనంతరం ట్రస్టు డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పరి